ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

మంగళవారం 4-08-2026 పేజీలు : 16

అక్షరమే ఆయుధంగా అక్రమార్కులను వణికించిన పాత్రికేయుడు

## ఇక లేరు...



మందా సత్యానందం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం...

16 పేజీలో...

## బురదలో అంగడి..

### కొనేది ఎలా..అమ్మేది ఎట్ల



5 పేజీలో...

## తలకొండపల్లిను ముంచెత్తుతున్న "బెల్ట్ దందా"..!

2 పేజీలో...

## జీజీహెచ్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

**- వైద్య ఆరోగ్యశాఖ ఉమ్మడి జిల్లా సమీక్షలో ఎమ్మెల్యే ధన్ పాల్..**



నిజామాబాద్ ఆగస్టు03:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తొందరగా పరిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం హైదరాబాదులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిత్యం 2 వేలకు పైగా ఓపీ నమోదవుతుందన్నారు. అటువంటి ఆసుపత్రిలో మల్టీ స్పెషాలిటీ స్థాయి సౌకర్యాలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉ ందన్నారు. ప్రధానంగా ఆసుపత్రిలో ఎంఆర్ఐ, మార్చురీ ఫ్రీజర్ల అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కావున లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సమీక్షలో చెప్పినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రిలో సివిల్ వర్క్ లకు సంబంధించిన పనులను తొందరగా పూర్తి చేయాలని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని చర్చించినట్లు చెప్పారు. అలాగే సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో వరుస సంచలనాలు"



- వివాహితతో అక్రమ సంబంధం, దాడి, బెదిరింపులు -
- అశోక్‌నగర్ గదిలో కీలక ఆధారాలు..
- శిక్షణ సమయంలోనే వివాదాలు -
- సహచర ట్రైనీల ఫిర్యాదులు...

16 పేజీలో...

## బీహార్ లోని బంకిపూర్‌లో బీజేపీ కంచుకోట బద్దలు

**- ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం -మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 3 : బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో బీజేపీకి ఎదురైన ఘోర పరాజయం దేశ రాజకీయాల్లో కీలక పరిణామమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

14 పేజీలో...

## ఎస్ఐఆర్ వివరాల నమోదును నిశితంగా పరిశీలించాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 03 :(విజన్ ఆంధ్ర )స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా కొనసాగుతున్న ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్లు నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన




10

## బర్ధిపూర్‌లో ఘనంగా బోనాల వేడుకలు...



బోధన్, (నిజామాబాద్) : బోధన్ మండలంలోని బర్ధిపూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. శివసత్తులు భక్తి పారవశ్యంతో ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకుని పోచమ్మవారికి, మహాలక్ష్మి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, ఊరేగింపులతో గ్రామమంతా ఆధ్యాత్మిక, ఉత్సవ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు, కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్లవీడు 1 అంగన్ వాడి సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర ) అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గొర్లవేడు 1 అంగన్ వాడి సెంటర్లో అంగన్ వాడి టీచర్ మందల సరోజన ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మందల లావణ్య హాజరై మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించాలన్నారు.మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. తర్వాత రెండు సంవత్సరాల వరకు అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం మాట్లాడుతూ తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు అనంతరం గర్భిణీలు బాలింతలకు బాలామృతం మరియు గ్రుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సుజాత వసంత గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్.

పరిగి, ఆగస్టు 03(విజన్ ఆంధ్ర ): పరిగి పట్టణంలో రెండో రోజు పోచమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా బహర్‌పేట్ పోచమ్మ తల్లి దేవాలయంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండుతూ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఐటీడీఏ ఉట్నూర్‌లో ప్రతి సోమవారం 'బోజ్జన్న బువ్వ'

**- ఆకలితో వచ్చే అర్జిదారులకు అన్నదానం**



కార్యాలయానికి ప్రతి సోమవారం వివిధ మండలాలు, గ్రామాల నుంచి దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు ఆకలితో ఇబ్బంది కలగకుండా 'బోజ్జన్న బువ్వ' కార్యక్రమం ద్వారా ఉచిత భోజనం అందిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు, అర్జిదారులు తమ పనులు పూర్తయ్యే వరకు కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వస్తుండటంతో, వారి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే బోజ్జు పటేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం వందలాది మంది ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా భోజనం చేసి ఎమ్మెల్యే బోజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# తలకొండపల్లిని ముంచెత్తుతున్న "బెల్ట్ దందా"..!



**- పల్లెల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు..! ఎవరూ ఆపరా..?**
**- పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు..! బెల్ట్ షాపులపై ప్రజల తిరుగుబాటు**
**- పాలు దొరకని చోట 90 ఎంఎల్**
**- చూసి చూడని అధికార యంత్రాంగమా..?**
**- అధికారుల సైలెన్స్.. బెల్ట్ దందాకు గ్రీన్ సిగ్నల్..?**
**- "అర్ధరాత్రి వరకు దందా.. అధికారులు నిద్రలో**
**- కిరాణా దుకాణాలే బార్‌లుగా మారిన రాజాపూర్..! యువత భవిష్యత్తు ప్రమాదంలో**

తలకొండపల్లి ఆగస్టు 03 ( విజన్ ఆంధ్ర) : తలకొండపల్లి మండలంలో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. ప్రతి గ్రామంలో 2 నుంచి 4 వరకు అక్రమ మద్యం దుకాణాలు నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

కిరాణా దుకాణాల పేరుతో బహిరంగంగానే మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఎమ్మార్పీ కంటే రూ.10--30 అధిక ధరలకు అమ్ముతున్నారు. పాలు దొరకని చోట 90 ఎంఎల్ మద్యం సులభంగా లభిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. యువత మద్యానికి బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటుండగా, కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. మద్యం మత్తులో గొడవలు, హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహిళలు గ్రామాల్లో ప్రశాంతత కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిషేధం ఉన్నప్పటికీ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇవి టీ టైం అడ్డాలా..! టైంపాస్ గడ్డాలా..!!

తలకొండపల్లి, ఆగస్టు 03, (విజన్ ఆంధ్ర): చాయ్ చమకురా తాగారా బాయ్.. చాయ్ చమక్కు చూడరా బాయ్.. ఈ చాయ్ గరీబికి విందు రా బాయ్.. అన్న చందంగా చాయి మనిషి జీవితంలో అంతగా పెనవేసుకపోయింది. రోజుకు కనీసం రెండు నుంచి పదుల సంఖ్యలో ఛాయిల వరకు స్వీకరించే ఛాయ ప్రియులూ ఉన్నారు. చాయ్ ప్రియుల ప్రేమను పసిగట్టిన కొంతమంది యువకులు, వ్యాపారులు టీ టైం అడ్డాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నారు. వివిధ రకాల పేర్లతో టీ టైం అడ్డాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా ఎటు చూసినా టీ టైం అడ్డాలే దర్శనమిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు ఈ వ్యాపారానికి జై కొడుతున్నారు. వివిధ రకాల ఫ్లేవర్లలో టీలను అందిస్తున్నారు.

### టైం పాస్ అడ్డాలుగా.. టీ టైం గడ్డాలు...!

రోడ్డులకు ఇరువైపులా పల్లె పట్టణం అన్న తేడా లేకుండా
ఎక్కడ చూసినా టీ టైం అడ్డాలే దర్శనమిస్తున్నాయి. నలుగురు స్నేహితులు లేదా వ్యాపారులు కలిస్తే చలో టీ టైం అన్న చందంగా తయారైపోయింది. జనాలకు అవి టైంపాస్ గడ్డాలుగా మారి చాయ్ తాగేందుకు వెళ్లి టీ టైమ్ అడ్డాలలో గంటల తరబడి కూర్చొని టైం పాస్ చేస్తున్నారు. కొందరు గంటల తరబడి ఫోనుకు అతుక్కుపోతూ... పానీయాన్ని మహా ప్రసాదంగా భావిస్తూ.. మరొకపక్క గుప్పుగుప్పు

**- ఎటు చూసినా టీ టైం అడ్డాలే.. ఏం చేసినా టైం పాస్ జనాలే!**
**- టీ టైంల ఏర్పాటుకు మక్కువ చూపిస్తున్న యువకులు**
**- చాయ్ అంటే ఇష్టమే.. ఆరోగ్యమే కష్టమా..!**
**- ట్రెండ్ గా మారుతున్న టీ టైంల వ్యాపారం**

మంటూ స్మోకింగ్ చేస్తూ ఎంజాయ్ చేసేస్తున్నారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ బిజినెస్, ఇతర లావాదేవీలకు కూడా శ్రీకారం చుడుతున్నారు.

### చాయి తాగితే చెప్పలేని ఆనందం.. మానసిక మందహాసం..!

ఛాయని సేవించడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక అలసట కూడా దూరం అవుతుందని, చాయిని దూరం చేసుకోవడం తమకు కష్టమే అవుతుందని పలువురు చాయి ప్రేమికులు చెబుతున్నారు. వీరు కనీసం రోజుకి 10- 12 కప్పులు తాగే జనాలు. వాటిని తగ్గించే ప్రయత్నం చేయాలనుకున్నప్పటికీ అలవాటుగా మారిపోయిందంటున్నారు. అంతగా చాయి ప్రేమలో పడ్డ వారు వాస్తవాలకు గ్రహించి వాటిని రోజుకు మూడు నాలుగు కప్పులు కపులకు తీసుకురావడం ఉత్తమమని వైద్యులు సలహా ఇస్తున్నారు. అంతేకాకుండా వాటికి ప్రత్యామ్నాయంగా లెమన్ టీ, గ్రీన్ టీ, జింజర్ టీ లాంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని భావిస్తున్నారు. ముఖ్యంగా బ్లాక్ కాఫీ తాగడం వల్ల లివర్ పనితనాన్ని మెరుగుపరుస్తుందని, రోజు ఒకటి లేదా రెండు కప్పులను మధ్యాహ్నం మూడు గంటల్లోపు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. టీ టైం అడ్డాలు టైంపాన్ గడ్డాలుగా మారినప్పటికీ పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు స్వయం సమృద్ధి పరమైన వ్యాపారానికి పునాది వేసినట్లు అవుతుంది.

### -చాయ్ అంటే ఇష్టమే.. కాని ఆరోగ్యమే కష్టమా..!

చాయ్ అంటే ఇష్టపడని వారు ఉండరు చాయ్ రోజుకు ఎన్నిసార్లైనా తాగడానికి సుముకుత వ్యక్తం చేసేవారు కూడా ఉన్నారు. కానీ ఈ చాయ్ మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందన్న విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. కొంతమంది ఆరోగ్యానికి హానికరం చేస్తుందని తెలిసినప్పటికీ దాన్ని పైన ఉన్న "మోజు" "బూజు" ను దులపలేకపోతున్నారు. చాయ్ ఒకప్పుడు బ్రిటిష్ వాళ్లకుల కాలంలో ప్రవేశించిన ఈ పానీయం ప్రస్తుతం భారతదేశ ప్రజల పవిత్ర పదార్థంగా మారిపోయింది. కానీ ఈ చాయిని తాగడం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, ముఖ్యంగా కడుపు ఉబ్బరం, ఎసిడిటీ, జీర్ణశక్తి మందగించడం, పక్షవాతం లాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందని, హృదయ కాలేయంకు ముప్పు పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాయ్ ఒక అలవాటుగానే ఉండాలని... వ్యసనంగా మాత్రం మార్చుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆగస్టు 10 దేశవ్యాప్త జైల్ భరో విజయవంతం చేయాలి

## - సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ పిలుపు.

కొండాపూర్ విజన్ ఆంధ్ర ఆగస్టు 3 : కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ పిలుపునిచ్చారు. సోమవారం కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో జైల్ భరో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని విమర్శించారు. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఎనిమిది



గంటల పనిదినం వంటి కార్మికుల సాధించిన హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ వీఓఏలతో అధిక పనిభారం వేయించి, తగిన వేతనాలు, సౌకర్యాలు, భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతుల సంక్షేమం పేరుతో నినాదాలు ఇస్తున్నప్పటికీ వారికి ప్రయోజనం చేకూరే చర్యలు కనిపించడం లేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని, విత్తన సవరణ బిల్లు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా విమర్శించారు.

గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వ పాలనలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువత, మహిళలు, విద్యార్థులకు ఆశించిన ప్రయోజనాలు కలగలేదని పేర్కొంటూ ప్రజలంతా ఐక్యంగా ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న కొండాపూర్ మండల కేంద్రంలో జరిగే జైల్ భరో కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య, సీఐటీయూ మండల నాయకులు బాబురావు, గ్రామస్తులు రత్నయ్య, సలీం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో ఎన్ ఆర్ ఐ పూజలు, గోశాల గోమాతలకు దానా బస్తాల వితరణ



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) గణపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో సోమవారం పర్వదినం సందర్భంగా గణపురం మండల కేంద్రానికి చెందిన అట్లూరి ఉదయలక్ష్మి జగన్ మోహన్ రావు, దంపతుల కుమార్తె అమెరికా కాలిఫోర్నియాలో నివాసముంటున్న కె.పునీత్, తులసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానించి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు నాగరాజు శాలువాలు పూలమాలలతో వారిని ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కోటగుళ్ళ గోశాల గోమాతలకు దాన బస్తాలు అందజేసిన పునీత్ తులసి దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ఇందనపల్లి ఘటన: బాధితులకు న్యాయం చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్

ఉట్నూర్, ఆగష్టు 03, (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి శివారులో నదికి చేపల వేటకు వెళ్లిన ఆదివాసి యువకులు కృష్ణ, అనిల్, విష్ణులపై అటవీ శాఖ అధికారులు దాడి చేశారంటూ ఆదివాసీ విద్యార్థి సంఘం, తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్, తుడుందెబ్బ సంఘాలు ఆరోపించాయి. వైరల్ వీడియోపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బాధితులకు రక్షణ, వైద్య, న్యాయ సహాయం అందించాలని, ఆదివాసుల రాజ్యాంగబద్ధమైన సంప్రదాయ హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరాయి. సిడాం జంగుదేవ్ పటేల్ రాష్ట్ర అధ్యక్షులు ఆదివాసీ విద్యార్థి సంఘం, జాడి వెంకటేష్ నేత, మంగం దీపక్, పెందుర్ త్రిమూర్తి, జంగు సిడాం పవన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



# చెట్లు కూలాయి.. ప్రశ్నలు మిగిలాయి..

- ప్రభుత్వ పాఠశాలలో చెట్లు నరికివేత.. ఎవరి అనుమతితో... ?
- అటవీ శాఖ, విద్యా శాఖ నిబంధనలు పాటించారా ! ?
- విద్యార్థుల ఆరోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత లేదా.. ! ?
- చెట్లను నరికి కలపను టింబర్ డిపోకు ఎవరి అనుమతితో తరలించారు?
- విద్యాశాఖ అధికారులకు తెలియకుండానే ఇదంతా జరిగిందా?

కుకునూరుపల్లి, ఆగష్టు03,విజన్ ఆంధ్ర : కుకునూరుపల్లి మండల పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో చెట్ల నరికివేత ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడి విద్యార్థులకు స్వచ్ఛమైన గాలిని, నీడను అందించిన విలువైన చెట్లను ఒకేసారి తొలగించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెట్లను నరికి వేయుటకు సంబంధిత శాఖల అనుమతి తీసుకున్నారా? అటవీ శాఖ, విద్యాశాఖ నిబంధనలు పాటించారా?లేక నిబంధనలు పక్కకు పెట్టి ఈ చర్య చేపట్టారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు పర్యావరణ పరిరక్షణ, హరితహారం, పాఠశాలల్లో పచ్చదనం పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటే, మరోవైపు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చెట్లను నరికివేయడం బాధాకరం. ఇది విద్యార్థుల ఆరోగ్యంపైనా, పర్యావరణంపైనా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇదంతా పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు తెలిసి జరిగిందా? తెలియకుండానే చెట్లు నరికివేసి టింబర్ డిపోకు తరలించారా అనే ప్రశ్నకు విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ బృందం మాత్రమే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉ



oదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చెట్లను అమ్ముకుంటే ఒకవేళ ఎవరి అనుమతితో ఎవరు అమ్ముకున్నారు? అమ్మితే వచ్చిన డబ్బులు ఏం చేశారు? అసలు చెట్లు అమ్ముకోవాలానే ఆలోచన కల్పించింది ఎవరు? ఇంతకు ఆ పాఠశాల ఏది?.. అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే సంబంధిత శాఖల అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి, వివరాలు వెల్లడించే వరకు వేచి చూడక తప్పదు.

# పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త కు సముచిత స్థానం

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

బోథ్. ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానాన్ని కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో బోథ్ మండలంలోని మందబొగుడ గ్రామానికి చెందిన 15 మంది గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విశ్వాసంతో తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు నూతన సభ్యులు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తోందని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత



గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమారి పీఏసీసీ చైర్మన్ మందుల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అందురు సర్పంచ్ పృథ్వీ, నక్కలవాడ సర్పంచ్ నవీన్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి నాయకులు జాదవ్ ఉమేష్,సుభాష్,మురళి, సంజీవ్, రమేశ్ ,సద్దాం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపేట్ బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



- ఈ నెల 9న జరిగే మహంకాళి బోనాల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- ట్రాఫిక్, విద్యుత్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన
- సుమారు 10 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం
- పెండింగ్ పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని ఆదేశం
- సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ

కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర) : ఈ నెల 9న మల్లంపేటలో జరగనున్న మహంకాళి బోనాల మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ సూచించారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభీపూర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ట్రాఫిక్ నియంత్రణ, వీధి దీపాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మల్లంపేట్ బోనాల ఉత్సవాలకు సుమారు 10 వేల మంది స్థానికులు, భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని శంభీపూర్ కృష్ణ పేర్కొన్నారు. ఉత్సవాలకు ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేసి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను కోరారు. మల్లంపేట్ బోనాల మహోత్సవాల విజయానికి స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, యువత, భక్తులు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుంట్ల అమర్నాథ్, వార్డు అధ్యక్షుడు ఉప్పరి లక్ష్మణ్, నాయకులు మాదాస్ నవీన్, నరసింహ, కోటేష్, అరుణ్, క్రాంతి, శ్రీకాంత్, వెంటేష్, మల్లేష్, వాసవి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లిలో నేడు మండల స్థాయి సమీక్ష సమావేశం



- అభివృద్ధి పనులపై కీలక సమీక్ష
- ఎంపీడీవో శాంతమ్మ

మర్పల్లి, ఆగస్ట్ 03(విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శాంతమ్మ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల వారీగా పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు సమయానికి హాజరై అవసరమైన వివరాలతో రావాలని ఎంపీడీవో శాంతమ్మ కోరారు.

# ఐటీడీఏ కార్యాలయం వద్ద సామూహిక మరుగుదొడ్డిని వెంటనే అందుబాటులోకి తేవాలి

- తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసె బాలకృష్ణ

మంగపేట/ఏటూరు నాగారం విజన్ ఆంధ్ర 02 : ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ కార్యాలయం సమీపంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి చాలా కాలంగా నిరుపయోగంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసె బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎస్‌టీఓ కార్యాలయం, మీ సేవా కేంద్రానికి వందలాది మంది ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారని తెలిపారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన మహిళలు, వృద్ధులు, చిన్నారులు మరుగుదొడ్డి సౌకర్యం లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సామూహిక మరుగుదొడ్డి వినియోగంలో లేకపోవడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరుగుదొడ్డిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి, నీటి సౌకర్యం, విద్యుత్, పరిశుభ్రత, నిర్వహణ ఏర్పాట్లు చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఆదివాసీ దినోత్సవంను విజయ వంతం చేయండి

- న్యాయవాది పంద్రం శంకర్

బోథ్ ఆగస్టు 3. (విజన్ ఆంధ్ర) : ఆగస్టు 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను విజయ వంతం చేయాలని న్యాయవాది పంద్రం శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన బోథ్ మండలం లోని పిప్పల్దారి మరియు జీడిపల్లె గ్రామ ప్రజలతో ఆగస్టు 9 వ తేదీన జరుపుకొనే ప్రపంచ ఆదివాసీ దినోత్సవన్ని పురస్కరించుకొని సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవన్ని ఒక పండుగల జరపాలని మరియు అధిక సంఖ్యలో ప్రజలు మహిళలు యూవత పాల్గొని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్మేడి ఆడేం బీమ్రావు, కరత్వాడ సర్పంచ్ దుర్వ విశ్వశ్వర్ రావు, పిప్పల్దారి సర్పంచ్ మెస్రం అనసూయ, కిస్టు మరియు మండడి నాగోరావ్ తొడసం గోపాల్ గ్రామాల పటేల్లు మరియు గ్రామప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు కృషితోనే డేంజర్ జోన్ ఇళ్ల సేకరణ

- రూ. 261 కోట్ల నిధుల విడుదల.. దళారుల మాటలు నమ్మవద్దు
- స్థానిక నిర్వాసితులందరికీ న్యాయం జరుగుతుంది
- ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి

తాడిచెర్ల, ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తాడిచెర్ల ఓసిపి మైనింగ్ ప్రభావిత డేంజర్ జోన్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చారని భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు దండు రమేష్, తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి తెలిపారు. సోమవారం తాడిచర్ల డేంజర్ జోన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో దశాబ్ద కాలంగా నివాస గృహాల సేకరణ విషయంలో ప్రజలు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక, ఈ ఏడాది ఫిబ్రవరి 23న మంత్రి శ్రీధర్ బాబు తాడిచెర్ల బాధితులు సుమారు 50 మందిని హైదరాబాద్ పిలిపించి, సచివాలయంలో జెన్‌కో ఉన్నతాధికారులతో హై లెవెల్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. కేవలం ఈ పటిష్టమైన రాజకీయ ప్రక్రియ ద్వారానే నిధుల విడుదల సాధ్యమైందని స్పష్టం చేశారు. కొందరు స్వార్థపరులు "మేము కోర్టులో కేసులు వేస్తేనే ఈ ప్రక్రియ ప్రారంభమైంది" అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని వారు తేదీల ఆధారాలతో ఖండించారు. జెన్‌కో సంస్థ జిల్లా కలెక్టర్ ఖాతాలో రూ. 261 కోట్లు డిపాజిట్ చేసిన తేదీ 26.05.2026 కాగా, అధికారులు సర్వే ప్రారంభించిన తేదీ 17.07.2026 అని గుర్తు చేశారు. వ్యతిరేక వర్గాలు ప్రచారం చేసుకుంటున్న కోర్టు జడ్జిమెంట్ అసలు రాకముందే, ఆ తీర్పు కంటే రెండు నెలల ముందే నిధులు డిపాజిట్ అయ్యి, రెండు వారాల ముందే సర్వే ప్రారంభమైందని వివరించారు. కాబట్టి ఇందులో కోర్టు ప్రమేయం ఏమీ లేదన్నారు. దళారుల పట్ల నిర్వాసితులు అప్రమత్తంగా ఉండాలని భూ నిర్వాసితుల కమిటీ పక్షాన పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక విజయపు క్రెడిట్ ఎవరికి దక్కుతుందో తాడిచెర్ల ప్రజలే చెప్పాలన్నారు. స్థానిక నిర్వాసితులందరికీ ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని, ఎవరూ కూడా అధైర్య పడి, అనవసరపు అబద్ధపు ప్రచారాలను నమ్మి అయోమయానికి గురి కావద్దని వారు స్పష్టం చేశారు. బాధితులందరికీ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, దన్నపునేని సురేష్ రావు, కేసారపు చంద్రయ్య, రామిడి గట్టయ్య, ఆర్ని సత్యనారాయణ, ఇందారపు సిద్దు నిర్వాసితులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన గ్రామ యువకులు... అంత్యక్రియలకు రూ. 5 వేల ఆర్థిక సాయం

పరిగి, ఆగస్టు 03(విజన్ ఆంధ్ర ): దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామానికి చెందిన సాలేటి కిష్టయ్య ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాదకర ఘటన తెలుసుకున్న గ్రామ యువకులు మానవతా దృక్పథంతో స్పందించి, ఆయన కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ సంతోష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి. శేఖర్ కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. గ్రామ యువకులు చేసిన ఈ సహాయం అభినందనీయమని వారు పేర్కొన్నారు. గ్రామ యువకుల మానవతా సేవను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బొక్క ఆశప్ప, మిల్క్ సెంటర్ శివ, గ్రామ యువకులు కే. చెన్నయ్య, శ్యాంసుందర్, కాళ్ల శ్రీనివాస్, ప్రతాప్, గ్రామస్తులు దబ్బు చెన్నప్ప, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.



## పట్నం రుక్కమ్మకు ప్రముఖుల ఘన నివాళి

చేవెళ్ల, ఆగస్టు 02 (విజన్ ఆంధ్ర) : శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ దశదినకర్మ కార్యక్రమం ఆదివారం మొయినాబాద్‌లోని జేపీఎల్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, పలువురు మంత్రులు, మాజీ మంత్రులు కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు షాబాద్ మండలం గొల్లూరుగూడలోని పట్నం రుక్కమ్మ స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్కెపల్లి మాజీ ఎంపీటీసీ వనం మాధవి, సీనియర్ యువ నాయకుడు వనం లక్ష్మీకాంత్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మొయినాబాద్‌లోని జేపీఎల్ కన్వెన్షన్‌లో జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సునీతమహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, సీనియర్ యువ నాయకుడు వనం లక్ష్మీకాంత్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాటమే లక్ష్యం

**- వడ్ల సత్యనారాయణ**

**- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక**

చేవెళ్ల, ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) : కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ అన్నారు. సోమవారం చేవెళ్ళ లో ఆయన 'విజన్ ఆంధ్ర'తో మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ నెల 2న తుక్కుగూడలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ మహాసభల్లో సుమారు 250 మంది ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోగా, జిల్లా అధ్యక్షుడిగా వడ్ల సత్యనారాయణను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగుతానన్నారు. ముఖ్యంగా వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం జరిగేలా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.



తన ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే. రామస్వామితో పాటు రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి సత్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బురదలో అంగడి.. కొనేది ఎలా..అమ్మేది ఎట్ల

**- వానొస్తే మర్పల్లి సంతలో నరక నరకయాతనే..!**

**- మౌలిక వసతుల్లేక రైతులు, వ్యాపారులు, వినియోగదారుల అవస్థలు**

**- అధికార తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



మర్పల్లి, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర):వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు అంగడి బజార్, సమస్యల నిలయంగా మారింది. మండలంలోని సుమారు 20 గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఈ సంతకు తరలివస్తున్నప్పటికీ కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వ్యాపారం జరుగుతుందని ఉద్దేశంతో దూర ప్రాంతాలైన జహీరాబాద్, కోహిర్, సదాశివపేట్ తదితర ప్రాంతాల నుండి వ్యాపారస్తులు ఇక్కడ వ్యాపారం చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు.

వర్షం కురిసిన ప్రతిసారి సంత ప్రాంగణం మొత్తం బురదమయంగా మారుతోంది. దీంతో కూరగాయల అంగడి బజార్‌అ డుగడుగునా బురద, వర్షపు నీరు పారుతూ ఉండటంతో కొనుగోలుదారులు బురదను దాటుకుంటూ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను వర్షపు నీటిలోనే విక్రయించాల్సి రావడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, మురుగు నీరు, చెత్తాచెదారం కారణంగా వినియోగదారులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు.సంత పరిసరాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతినడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలు రహదారులపై నిలిపివేయడం, ఆటోలు, పండ్ల బండ్లు ఇష్టారాజ్యంగా నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.పాదచారులు ప్రధాన రహదారిపైనే నడవాల్సి వస్తుండటంతో ప్రమాదాల భయం వెంటాడుతోంది. సంత రోజున ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.మర్పల్లి మండల కేంద్రానికి తగిన విధంగా శాశ్వత సంత స్థలాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని, అప్పటివరకు ప్రస్తుత సంతలో తాత్కాలికంగా అయినా బురద నివారణ, పారిశుద్ధ్యం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు అధికారులను కోరుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పోలీస్ స్టేషన్‌లో "ఆయనే బాస్"..?

**ఎస్ఐ కంటే హెడ్ కానిస్టేబుల్ హవానే ఎక్కువా?**

**- వసూళ్లు, పైరవీలు, రాజకీయ సాన్నిహిత్యంపై ప్రజలు తీవ్ర ఆరోపణలు**

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03(విజన్ ఆంధ్ర ) : పోలీస్ స్టేషన్ అంటే ప్రజలకు న్యాయం లభించే ప్రదేశం. బాధితుడు తన గోడును చెప్పుకునే చోటు. కానీ జిల్లాలో ఓ పోలీస్ స్టేషన్‌లో మాత్రం ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది ఉన్నప్పటికీ.. "ఆయనే ఎస్ఐ.. ఆయనే సీఐ.. ఆయనే ఏఎస్ఐ.. ఆయనే హెడ్ కానిస్టేబుల్" అన్నట్టుగా ఒక సీనియర్ హెడ్ కానిస్టేబుల్ ఆధిపత్యం కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.కొత్తగా ఎస్ఐ బాధ్యతలు స్వీకరించినా, స్టేషన్‌లోని వ్యవహారాలపై సీనియర్ హెడ్ కానిస్టేబుల్ ప్రభావం తగ్గడం లేదని, కొత్త ఎస్ఐని సైతం తన మాట వినేలా 'కార్నర్' చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.గ్రామాల నుంచి వచ్చే బాధితులకు గేటు దగ్గరే 'తీర్పు'?

మారుమూల గ్రామాల నుంచి చిన్నచిన్న పంచాయతీలు, కుటుంబ తగాదాలు, గొడవలు వంటి సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను ప్రధాన గేటు దగ్గరే నిలిపివేసి మాట్లాడటం, సంబంధిత ఎస్ఐని కలవకుండా మధ్యలోనే వ్యవహారాన్ని చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా ఇరు వర్గాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

"న్యాయం కావాలంటే ముందుగా డబ్బు.. ఎవరి మాట వినాలన్నా పైసలు" అనే పరిస్థితి ఏర్పడిందని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

సర్పంచులతో సన్నిహిత సంబంధాలపై ఆరోపణలుఈ హెడ్ కానిస్టేబుల్‌కు కొందరు గ్రామ సర్పంచులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, వారితో కలిసి తినడం వరకు సంబంధాలు కొనసాగుతున్నాయని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామాల్లో చిన్న గొడవ జరిగినా కొందరు సర్పంచులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆ హెడ్ కానిస్టేబుల్‌కే ఫిర్యాదు అప్పగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో సాధారణ ప్రజలకు పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి నేరుగా ఎస్ఐని కలిసే అవకాశం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."పైసలు ఇచ్చేవారికి ఒక న్యాయం.. నిజాయితీగా వచ్చేవారికి మరో న్యాయం"?ఆ హెడ్ కానిస్టేబుల్‌కు డబ్బులు ఇచ్చేవారంటే ప్రత్యేక అభిమానం, నిజాయితీగా వ్యవహరించాలని కోరుకునే ప్రజలంటే అసహనం అనే విమర్శలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి."డబ్బులు ఇచ్చేవారి మాటకు విలువ.. డబ్బులు ఇవ్వని సామాన్యుడి సమస్యకు విలువ లేదు" అనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడటం పోలీస్ శాఖ ప్రతిష్ఠకే మచ్చగా మారుతుందని పలువురు అంటున్నారు. అయితే ఇవి ధృవీకరించాల్సిన ఆరోపణలే తప్ప నిర్ధారిత వాస్తవాలు కావు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉంది.కిరాణా దుకాణం నుంచి పెట్రోల్ బంక్ వరకు.. "ఇంప్లెయిన్స్" ఉపయోగం?కిరాణా దుకాణాల నుంచి పెట్రోల్ బంకుల వరకు, పెట్రోల్ బంకుల నుంచి మద్యం దుకాణాల వరకు తన పలుకుబడిని, అధికార ప్రభావాన్ని ఉపయోగించని రంగం లేదనే ఆరోపణలు కూడా బహిరంగంగా వినిపిస్తున్నాయి.

## మా భూములకు పట్టాలు ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03 ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామ శివారులోని సర్వే నెం. 34 లో మేము మా నాన్నల నుండి వారసత్వం గా భూమిని దున్నుకుంటూ గత ముప్పై సంవత్సరాలనుండి జీవనం కొనసాగిస్తున్నాము ఫారెస్ట్-రెవెన్యూ శాఖల సంయుక్త సర్వే (జాయింట్ సర్వే ) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను గ్రామస్తులు, మరియు సర్పంచు అందరు కలిసి వినతి పత్రం అందించడం జరిగింది.

సర్వే నెం. 34లో గల భూమిపై సుమారు 70 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ఆ భూములకు ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా మంజూరు అయ్యాయని అయితే, అటవీ శాఖ అధికారులు ఆ భూముల్లో బోరు వేయడం, విద్యుత్ సౌకర్యం కల్పించుకోవడం వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించకుండా అడ్డుకుంటున్నారు. దీనివల్ల మా జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేశామని గ్రామస్తులు తెలిపారు. అందువల్ల, పందిపంపుల గ్రామ శివారులోని సర్వే నెం. 34లో గల భూమికి ఫారెస్ట్ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో సంయుక్త సర్వే (జాయింట్ సర్వే ) నిర్వహించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ను కోరడం జరిగింది.

## రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలి

**- ప్రజావాణిలో అధికారులకు స్థానికుల వినతిపత్రం సమర్పణ**

చౌటకూర్ ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) :- మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డుకు ఆనుకుని అత్యంత ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే అక్కడ నుంచి తొలగించి, వేరే ప్రాంతానికి మార్చాలని కోరుతూ స్థానిక ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... చౌటకూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు, బాటసారులు నిత్యం భయపడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం చాలా ఎక్కువగా ఉందని చౌటకూర్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, భవిష్యత్తులో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాం రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామ గౌడ్, కుమార్ గౌడ్, వార్డు సభ్యులు చక్రపాణి, గోరేమియా, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

## తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

లింగాల గణపురం ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని కళ్లెం గ్రామంలో అంగన్వాడీ సెంటర్ 2లో ఐసిడిఎస్ సూపర్వైజర్ హంసమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం జరిగినది. తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తూ ఈ కార్యక్రమంలో భాగంగా ఒక గర్భిణీ స్త్రీకి శ్రీమంతం మరియు సర్పంచ్ బంద శోభ చంద్ర మౌళి చేతుల మీదుగా చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా క్యాథరిన్ (రిటైర్డ్ ఇన్చార్జి డీపీహెచ్ఓ) హెల్త్ సూపర్వైజర్ సుజాత ఏఎన్ఎం శారద పంచాయతీ సెక్రటరీ యాకలక్ష్మి , గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం కమిటీ మెంబర్స్ తల్లులు అంగన్వాడీ టీచర్ గౌసియా బేగం ఆయా సరోజన సిపి అనిత పాల్గొన్నారు.



## కొత్తచెరువు కట్టపై నాణ్యతలేని నాసిరకం అభివృద్ధి పనులు

**- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 3 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కొత్తచెరువు కట్టపై అరపల్లెకు రోడ్డు ట్యాంక్ బండ్ సుందరికరణ పనులను అభివృద్ధి చేయాలని ప్రజలకు అందుబాటులోకి తేవాలని, రైతులకు పంటలు పండించుకోవడానికి చెరువులో నీరు అందుబాటులోకి తేవాలని లక్ష్యంతో స్థానిక మంత్రి పోన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కాని అధికారుల నిర్లక్ష్యంతో కొత్తచెరువు కట్టపై సుందరికరణ,మినీ బండ్ అభివృద్ధి పనులలో నాణ్యత లోపం నాసిరకం పనులు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కాంట్రాక్టర్ ఇష్ట రాజ్యంగా నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేసినాడని రైతులు తెలిపారు. చెరువు కట్టపై ర్యాక్లో భాగంగా నాసిరకం పగిలిపోయే రాళ్లు వాడుతున్నారు దీంతో కట్ట బలహీనపడుతుందని, కట్టకింద నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్ లో తక్కువ సిమెంట్ తో ఇష్టారాజ్యంగా నాణ్యత లోపంతో వాల్ నిర్మించారని రైతులు ఆరోపిస్తున్నారు. కొత్తచెరువు కట్టపై నాణ్యత లేకుండా నాసిరకం పనులు జరుగుతున్న దగ్గరుండి పర్యవేక్షణ చేయాల్సిన నీటిపారుదల శాఖ మరియు క్వాలిటీ కంట్రోల్ అధికారులు, పట్టించుకోవడంలేదని ఏప్పుడో ఒకసారి వచ్చి పోతున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో బలహీనంగా చెరువు కట్ట పనులు ఉండటంతో హుస్నాబాద్ పట్టణంలో భారీగా వర్షాలు వచ్చినప్పుడు వరద మొత్తం ఈ చెరువులోకి వస్తుందని దీంతో కట్టకు ప్రమాదం జరిగితే పొలాలు మొత్తం దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు క్వాలిటీ కంట్రోల్ అధికారులు జరుగుతున్న పనిలను పరిశీలించి నాణ్యతగా చేయించాలని ప్రజలు రైతులు కోరుతున్నారు.

## ఎస్సీ సబ్ ప్లాన్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం ఎందుకు?

**- సబ్ ప్లాన్ నిధులతో మంజురైన పనులను వెంటనే పూర్తి చేయాలి**

**- జిల్లా ప్రజావాణి లో సర్పంచ్ ల వినతి**



గజ్వేల్ నియోజకవర్గం, 03 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : జగదేవపూర్ మండలం లో పలు గ్రామాల్లో ఎస్సి కాలనీలలో సబ్ ప్లాన్ నిధుల కింద మంజూరైనా పనులను వెంటనే పూర్తి చేయాలనీ జిల్లా ప్రజావాణి లో తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు మరియు, తిగుల్ సర్పంచ్ రజిత పరుశురాం, పీర్ల పల్లి సర్పంచ్ ఓంప్రకాష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల అభివృద్ధి కాలనీ అభివృద్ధి కోసం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ న్ చట్టం తీసుకువచ్చిందని, ప్రతి శాఖ ద్వారా 25శాతం ఎస్సీ ఎస్టీలకు ఖర్చు చేయాలి కానీ పేరుకే చట్టం ఉంది కానీ నిధులను పక్కదారి పడుతుందన్నారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారన్నారు. గ్రామాలలో కేటాయించిన సబ్ ప్లాన్ పనులను ఎందుకు పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోతున్నారన్నారు. కాంట్రాక్టర్లు సబ్ ప్లాన్ పనులు చేస్తే డబ్బులు రావడంలేదని అని చెప్పుతున్నారన్నారు. ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చినటువంటి సబ్ ప్లాన్ చట్టం పైన చిత్తశుద్ధితో పనిచేయలి అని తెలిపారు. ఇప్పటికే తిమ్మాపూర్, పీర్లపల్లి తిగుల్ గ్రామాలలో కేటాయించిన పనులను కాంట్రాక్టర్ తో మాట్లాడి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళితులతో ఉద్యమం చేపట్టాల్సిన వస్తుందని హెచ్చరించారు.

## గజ్వేల్ లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ అవగాహన కార్యక్రమం



గజ్వేల్, 03 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో, సెంట్ మేరీస్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన "సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ అవగాహన కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలందరూ పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణహితమైన వస్త్ర సంచులు, జూట్ బ్యాగులు వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించేలా ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ రాయబారులుగా మారి తమ ఇళ్లలో, పరిసరాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణం ఏర్పడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు మరియు వాయు కాలుష్యం ఎలా జరుగుతుందో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సమగ్రంగా వివరించారు. పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత మోడల్ మున్సిపాలిటీగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌ను తీర్చిదిద్దడానికి ప్రతి పౌరుడు పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్ కార్ పద్మబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సెంట్ మేరీస్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాశెట్టి టౌన్షిప్‌లో ఘనంగా బోనాల జాతర

సదాశివపేట: సదాశివపేట పట్టణంలోని కశెట్టి టౌన్షిప్ కాలనీవాసులు ఆదివారం ఆషాడమాస బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాలను కాలినిలోని శివాలయం నుండి డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయాన్ని చేరుకొని అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని కాలనీ పెద్దలు తెలిపారు.

# ఉపాధి కాపాడాలి.. ఫ్యాక్టరీ ఉత్పత్తులు పునరుద్ధరించాలి

**- శివంపేట బీర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు సీఐటీయు వినతిపత్రం**



చౌటకూర్ ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం శివంపేట మండలంలోని బీర్ ఫ్యాక్టరీలో గత వారం రోజులుగా ఉత్పత్తులు నిలిచిపోవడంతో వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటూ, కార్మికుల జీవనోపాధిని పరిరక్షించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కంపెనీపై వచ్చిన కాలుష్య ఆరోపణలపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలుష్యం జరిగినట్లు శాస్త్రీయంగా నిరూపితమైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, కానీ వాస్తవాలు తేలకముందే పరిశ్రమ ఉత్పత్తులను నిలిపివేయడం వల్ల వందలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కార్మికుల ఉపాధికి ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ డ్యూటీలు, ఉద్యోగ భద్రత, తగిన పని దినాలు కల్పించాలని, పరిశ్రమను పూర్తి స్థాయిలో తిరిగి ప్రారంభించేలా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శివంపేట ప్రాంత ప్రజల ఉపాధికి ఈ పరిశ్రమ కీలకమని, పర్యావరణ పరిరక్షణతో పాటు కార్మికుల జీవనోపాధికి కూడా సమాన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ఉపాధ్యక్షులు పి బాగారెడ్డి, నాయకులు, ప్రసన్న రావు, సురేష్, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి చంద్రయ్య శీను యశోద సుమిత్ర రాములు విట్టల్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## తాడిచర్లలో ముమ్మరంగా సాగిన గ్రామసభ

**- 2026-27 గ్రామాభివృద్ధి ప్రణాళికపై విస్తృత చర్చ**

**- విద్యుత్ శాఖ అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం**

మల్హర్, ఆగస్టు 03 విజన్ ఆంధ్ర : తాడిచర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి అధ్యక్షతన సోమవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక (2026-27)పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, పారిశుధ్యం, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, సీసీ రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాల ఏర్పాటుపై చర్చించారు. 'జలసిరి'లో భాగంగా ఇంగుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ పిట్స్ నిర్మాణాలపై కార్యాచరణ రూపొందించారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కాగా, ఈ కీలక సమావేశానికి విద్యుత్ అధికారులు డుమ్మా కొట్టడంపై సభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చౌటకూర్ మండల ఉప సర్పంచ్ ఫోరం రద్దు.. త్వరలో కొత్త కమిటీ ఏర్పాటు



చౌటకూర్, ఆగస్టు 03: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడి ఎంపికపై నిన్న జరిగిన సమావేశంలో పార్టీ నిర్ణయం తీసుకున్నప్పటికీ, అనంతరం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మండలంలోని ఉప సర్పంచ్‌లు సోమవారం సమావేశమై, నిన్న ఏర్పాటు చేసిన ఉప సర్పంచ్ ఫోరాన్ని రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రోజుల్లో మరో సమావేశం నిర్వహించి కొత్త ఫోరం కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌ల సమన్వయంతో పారదర్శకంగా కొత్త కమిటీని ఎన్నుకుంటామని వెల్లడించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 11 లోపు దోస్త్ రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేసుకోవాలి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 3 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో చేరడానికి చివరి అవకాశం ఆగస్టు 6 నుండి 11 లోగా 'దోస్త్' రిజిస్ట్రేషన్ చేసుకోని అడ్మిషన్ పొందాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థిని,విద్యార్థుల నుండి డిగ్రీ ప్రవేశాల కొరకు తెలంగాణ ప్రభుత్వ "డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ" (దోస్త్2026) ద్వారా అప్లై చేయాలన్నారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ 2(ఆఖరి విడుత) రిజిస్ట్రేషన్లకు ఆగస్టు 6 నుండి 11 వరకు, 2026 మాత్రమే అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి .కామ్, కంప్యూటర్



అప్లికేషన్స్,బి ఏస్సీ,సైన్స్ గ్రూప్ లలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి ఫీజు రీఇంబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉన్నదన్నారు. మొబైల్ నెంబర్ ద్వారా అధికారిక వెబ్ సైట్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకావాలన్నారు.

# జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్‌లో "యాంత్రిక విజ్ఞాన వేదిక" ఘన ప్రారంభం



చౌటకూర్ ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సుల్తాన్‌పూర్‌లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం "యాంత్రిక విజ్ఞాన వేదిక" (ఎటర్నల్ మెకానికల్ ఇంజనీర్స్ క్లబ్)ను ఘనంగా ప్రారంభించారు. ఈ వేదిక ద్వారా విద్యార్థులకు సాంకేతిక సదస్సులు, నిపుణుల ఉపన్యాసాలు, పారిశ్రామిక సందర్శనలు, వర్క్‌షాప్‌లు, డిజైన్ పోటీలు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు మరియు నూతన ఆవిష్కరణలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానం, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అలవర్చుకోవడంలో ఇటువంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రాఘవేందర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సాంకేతిక ఆలోచనా విధానం, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంలో ఇలాంటి క్లబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తరగతి గది విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి (హెచ్‌ఓడీ) డా. శైలజ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, నూతన ఆవిష్కరణలకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. సంతోష్ కుమార్

సదాశివపేట: విజన్ ఆంధ్ర: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం సదాశివపేట ఎస్ వి ఎస్ బ్యాంకెట్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉమ్మడి మెదక్ జిల్లా రాజ్ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ జి. సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సయ్యద్ ఆసిఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, యూనియన్ బలోపేతం, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ నియామకంపై జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, యూనియన్ నాయకులు సంతోష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.



## వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో ముగిసిన వరుణ యాగం

గజ్వేల్ నియోజకవర్గం, 03 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి కరుణించాలని కాంక్షిస్తూ ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వరుణ యాగం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ మహా రుద్రాభిషేకంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, గురువులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా పది రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ మహత్కార్యం సత్ఫలితాలు ఇవ్వాలని కాంక్షిస్తూ శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారికి సోమవారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడాలని కాంక్షిస్తూ యజ్ఞ యాగాదులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వేద పండితులు నిర్వహించే విశేష వైదిక క్రతువు వరుణ యాగంతో ప్రకృతి కనికరిస్తుందని, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని స్పష్టం చేశారు. మూల మంత్ర హోమము, ప్రత్యేక కలశ పూజలు, మహా రుద్రాభిషేకం తదితర నిర్వహించగా, శ్రీ పరమేశ్వరుడి కృప కోసం ప్రతినిత్యం ఆలయ సముదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. అయితే రైతులు సుభిక్షంగా పంటలు పండించాలని తమ లక్ష్యం కాగా, ఆ దిశగా క్షేత్రంలో ఈ పుణ్యకార్యం నిర్వహించినట్లు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ వివరించారు.



# కేశంపేట మండలంలో సర్ పరిశీలన - పాల్గొన్న షాద్నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అందే బాబయ్య

విజన్ ఆంధ్ర కేశంపేట 04 కేశంపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో పరిశీలన నిర్వహించారు. ఇప్పలపల్లి దేవుని గుడి తండా కొాములపల్లి కొండారెడ్డిపల్లి కాకునూరు 9 రేకుల లింగం దాన నిరుదవెల్లి లేమామిడి భోజనం పల్లి కేశంపేట చింతకుంటపల్లి వేముల నర్స గ్రామాలలో సర్ కార్యక్రమాన్ని షాద్నగర్ నియోజకవర్గం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓలతో సమావేశమై ఓటు జాబితా సవరణ ప్రక్రియ నమోదు మార్పులు తొలగింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పశువుల నరసింహ యాదవ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ మండల జనరల్ సెక్రెటరీ కల్వకొల్లు తిరుపతి మండల ఉపాధ్యక్షులు కంచుకోట నరసింహ సీనియర్ నాయకులు కర్రల నరేందర్ రెడ్డి కానము ఉదయ్ మున్నూరు యుగంధర్ భక్తవత్సల్ శివాజీ కనుగుల మహేష్ ఆకుల గోపాల్, వేణుగోపాల్ గోపాల్ రెడ్డి మరియు తదితర భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేశంపేట మండల వార్డు మెంబర్ల ఫోరం ఉపాధ్యక్షుడిగా జింకల యాదగిరి యాదవ్ ఎంపిక



విజన్ ఆంధ్ర కేశంపేట 04 కేశంపేట మండల వార్డ్ మెంబర్ ఫోరం ఉపాధ్యక్షుడిగా జింకల యాదగిరి యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జింకల యాదగిరి యాదవ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారం గ్రామ అభివృద్ధి ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరిని సమన్వయం చేసుకుంటూ బాధ్యతయుతంగా పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు వార్డు సభ్యులు నాయకులు మాట్లాడుతూ జింకల యాదగిరి యాదవ్ నాయకత్వంలో ఫోరం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వార్డుల్లో విస్తృతంగా పర్యటించిన చైర్‌పర్సన్ దావ స్వాతి

**4వ వార్డు లో 10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**



బెల్లంపల్లి, ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొత్త బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన ఇసుక మేటలు, మట్టిని జేసీబీ సహాయంతో తొలగించి రహదారిని చదును చేయించారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగంతో తక్షణ చర్యలు చేపట్టించినట్లు తెలిపారు. తదుపరి మున్సిపాలిటీ 4వ వార్డులో యూఐడీఎఫ్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని పేర్కొంటూ, పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ 22వ వార్డుకు చెందిన రాసపల్లి రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ అవసరమైన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు చింతల వసంత, ఈట కమల, బేతి శ్రావణ్, మాజీ కౌన్సిలర్లు నీలి కృష్ణ, అస్మాషేక్ నాయకులు పీక లక్ష్మణ్, మున్సిపల్ డీఈ సుమతి, ఏఈ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

ముధోల్:ఆగష్టు 03:విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన ముధోల్ లోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్, హాజరై అన్నప్రసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు మరియు తల్లులకు తల్లిపాల విశిష్టతపై ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు (కొలొస్ట్రమ్) పసిపాపలకు మొదటి టీకా వంటిదని, ఇది పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. అంగన్వాడి సేవల ప్రాముఖ్యత అంగన్వాడీ సేవల ప్రాముఖ్యతను కూడా ఈ సందర్భంగా వివరించారు. పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ, తల్లులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమం లో సి డి పి ఓ రాజశ్రీ, వార్డ్ సభ్యులు విశ్వంబర్, నజియా అఫ్రోజ్, ముజీబ్, ఏ ఎన్ ఎం విజయ, జ్యోతి,అంగన్వాడీ టీచర్స్,ఆశవర్కలు తదితరులు పాల్గొన్నారు.



# తైక్వాండోలో సత్తా చాటిన సంస్కృతి పాఠశాల విద్యార్థులు



**- ఆరు పతకాలు సాధించిన విద్యార్థులు.. అభినందించిన పాఠశాల యాజమాన్యం**

చేవెళ్ళ, ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) : తైక్వాండో పోటీల్లో చేవెళ్ళ, సంస్కృతి పాఠశాల విద్యార్థులు ఆరు పతకాలు సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ అత్తెల్లి శశిపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, కృషితో సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్‌జిల్లా ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులు నాలుగు బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకాలు సాధించారు. ఆరవ తరగతికి చెందిన రిత్విక్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, కుశాల్, ఐదో తరగతికి చెందిన వేదశ్రీ బంగారు పతకాలు సాధించగా, మాణిక్యకృష్ణ అర్జున్ వెండి, నాలుగో తరగతికి చెందిన మెదాన్ష్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజేతలను అభినందించారు. రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వంద పడకల ఆసుపత్రిని అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ నే ఆసుపత్రి అభివృద్ధి పై రాజకీయం చేయద్దు

**జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, చైర్మెన్ బుర్ర కొమురయ్య**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి 100 పడకల ఆసుపత్రి నీ భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి నిన్న వందపడకల ఆసుపత్రిని సందర్శించి జిల్లా ఆసుపత్రి అపరిశుభ్రంగా ఉందని జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయం అందడం లేదని అసత్య ప్రచారం చేయడంపై జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య మాట్లాడుతూ... మాజీ శాసనసభ్యులు వెంకటరమణారెడ్డి కి ఆదివారం సెలవు దినం కావడం బహుశా అతను మర్చిపోయారేమో ఆదివారం రోజు డాక్టర్లు గాని సంబంధిత ఎమ్మారై స్కాన్ చేసే సిబ్బంది కి సెలవు రోజు కావడంతో ఎవరు అందుబాటులో ఉండకపోవచ్చు కానీ ఇవన్నీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మర్చిపోయారేమో జిల్లా ఆసుపత్రిని ఇప్పటికే అన్ని విధాల వసతులు కల్పించి కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి ఆసుపత్రిని సౌకర్యాలతో మెరుగుపరిచే విధంగా అన్ని వైద్య సదుపాయాలు అందించడంలో కీలకపాత్ర వహించినటువంటి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అని ఒకసారి గుర్తుచుకోండని మీ ప్రభుత్వం ఆయాంలో గత పది సంవత్సరాల కాలంలో మీరు చేసిన అభివృద్ధి ప్రజలకు మాత్రం తెలుసు మీ హాయంలో ఒక బోరుతో సరిపెట్టుకున్నారు కానీ మా ప్రభుత్వంలో రెండు బోర్లను వేయించామని అలాగే బాత్రూంలో అపరిశుభ్రంగా ఉందని మీరు అనడం నవ్వొచ్చే విధంగా ఉందని ఆసుపత్రిలో ఉన్నటువంటి బాత్రూంలు రిపేరు దశలో ఉన్నాయని ఒక్కసారి వాటిని సరిచూసుకోండని అన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధిపై అసత్య ప్రచారాలు మానుకుంటే చాలా మంచిదని లేదంటే రాజకీయంగా ప్రజలే మిమ్మల్ని బుద్ధి చెప్తారని మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వంద పడకల ఆసుపత్రికి కోట్ల రూపాయలు వె చ్చించి సిటి స్కాన్ మరియు మెరుగైన వైద్యులు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాత్రమే అని ఇలా చౌకబారులో మాటలు మాట్లాడితే రాజకీయంగా మీరు సింపతి పందుతారేమో కానీ ప్రజలకు మాత్రం ఆసుపత్రిని అభివృద్ధి చేసింది గండ్ర సత్యనారాయణకు మాత్రమే పేరు దక్కుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లోమున్సిపల్ వైస్ చైర్మెన్ అంబాల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు దేవన్, జిల్లా కార్యదర్శి వెంకీ యాదవ్, మాకోటి ప్రభాకర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్--పూలే ఆశయాలతో నేటి నుంచి నాటకోత్సవాలు

- బెల్లంపల్లి సింగరేణి కళావేదికలో మూడు రోజుల పాటు ప్రదర్శనలు
- సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం.. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

బెల్లంపల్లి ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : సింగరేణి ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ (హైదరాబాద్) నిర్వహిస్తున్న మూడు రోజుల నాటకోత్సవాలు ఆగస్టు 4 నుండి 6వ తేదీ వరకు బెల్లంపల్లిలోని సింగరేణి కళావేదికలో జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలిపారు. మొదటి రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలను ప్రతిబింబించే 'సంఘం శరణం గచ్ఛామి', రెండో రోజు మహాత్మ జ్యోతిరావు పూలే--సావిత్రిబాయి పూలే జీవితాలు, సామాజిక సంస్కరణలను ఆవిష్కరించే 'సత్య శోధన', చివరి రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ తాత్విక భావజాల ప్రయాణాన్ని ఆవిష్కరించే 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకాలు ప్రదర్శించనున్నారు. పట్టణ ప్రజలు, సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరై ఈ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని సింగరేణి అధికారులు కోరారు.

## తెలంగాణ జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం 4న సుందరయ్య విజ్ఞాన భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం

అక్కన్నపేట ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : తెలంగాణ జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం ఆగస్టు 4న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ జానపద సకల కళల పరిరక్షణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఆదివారం అక్కన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, జానపద నిపుణులు, కవులు, జానపద కళాకారులు, కళాభిమానులు సమావేశానికి హాజరై ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడిచినా రాష్ట్రానికి సాంస్కృతిక విధానం లేకపోవడం విచారకరమన్నారు. దేశంలో అత్యధిక జానపద కళారూపాలు, కళాకారులు ఉన్న తెలంగాణలో జానపద కళల పరిరక్షణ, అభివృద్ధి, కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించి, కళాకారులకు జీవన భరోసా కల్పించడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమానికి జానపద కళాకారులు, సాంస్కృతిక సంస్థలు, మేధావులు, కళాభిమానులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 22న ప్రపంచ జానపద దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు

## ప్రజలందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు

అక్కన్నపేట, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర) : నేటి సమాజంలో సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ నాయకుడు మైపాల్ రెడ్డి మల్కి అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన విడుదల చేసిన సందేశంలో మాట్లాడుతూ, ఫోన్‌లో వేలాది కాంటాక్టులు, సోషల్ మీడియాలో వందలాది మంది స్నేహితులు ఉన్నా, ఆపదలో అండగా నిలిచే నిజమైన మనుషులు తగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు, హోదా, ఆస్తుల కంటే కుటుంబ బంధాలు, స్నేహాలు, పరస్పర ప్రేమాభిమానాలే జీవితంలో శాశ్వతమని పేర్కొన్నారు. అహంకారం, స్వార్థం కారణంగా బంధాలను దూరం చేసుకోవద్దని, ముందుగా మనమే పలకరించి సంబంధాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆస్తులతో పాటు మంచి విలువలు, మానవత్వం, బంధాలను కాపాడుకునే సంస్కారాన్ని కూడా వారసత్వంగా అందించాలని ఆయన కోరారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చాలా కాలంగా మాట్లాడని బంధువులు, స్నేహితులకు ఒక్కసారి ఫోన్ చేసి పలకరించాలని, అదే అనుబంధాలను మరింత బలపరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై అన్ని యూనియన్లు మౌనం వీడాలి

### ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అశ్వక్ అహ్మద్



అక్కన్నపేట, ఆగస్టు 3(విజన్ ఆంధ్ర) : సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై అన్ని యూనియన్లు మౌనం వీడాలని ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అశ్వక్ అహ్మద్ కోరారు.

సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, పదవీ విరమణ అనంతరం ఎదురవుతున్న ఇబ్బందులపై యూనియన్లు మరింత చురుకుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న వారికి జీతాలు వస్తున్నప్పటికీ, పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగులు తమ సొంతంగా జమ చేసిన నిధులను సైతం పూర్తిగా పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులు తమ సొంతంగా చెల్లించిన సీపీఎస్ వాటాను త్వరితగతిన తిరిగి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. సిపిఎస్ ఉద్యోగుల గురించి అన్ని యూనియన్లు మౌనంగా ఉన్నాయని మనకు రావాల్సిన బకాయిల గురించి మన యూనియన్ యాక్టివ్ గా ఉండాలంటే రిటైర్ అయిన వాళ్ళందరూ మీకు సర్వీస్ ఇప్పిస్తామని ఓపిఎస్సి మారుస్తామని ఒక యూనియన్ కొక్కరు ఒకనెల జీతం ఇవ్వమంటుందని నమ్మబలికి మీ దగ్గర వసూలు చేసిన లక్షల కొద్ది ఇచ్చిన రూపాయలు తిరిగి తీసుకోండి ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకోండిఅప్పుడే వారు స్పందిస్తారని అశోక్ అహ్మద్ కోరారు

# తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష



గజ్వేల్ నియోజకవర్గం, 03 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : గజ్వేల్ మండలం అహ్మదిపూర్ అంగన్వాడి సెకండ్ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక అవగాహన కల్పించిన సూపర్వైజర్ భవానీ శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారం, తొలి రక్షణ కవచమని సూపర్వైజర్ భవానీ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, సరైన పద్ధతిలో పాలివ్వడం, పుట్టిన గంటలోనే ముర్రుపాలు ఇవ్వాల్సిన అవసరం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలనే అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తల్లి పాలే శిశువుకు తొలి రక్షణ తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, డయేరియా వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయి. మెదడు, కళ్ల అభివృద్ధికి తోడ్పడి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయి. ముర్రుపాల ప్రాముఖ్యత పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించే అమూల్యమైన ఆహారం. శిశువు జన్మించిన తొలి గంటలోనే ముర్రుపాలు ఇవ్వడం అత్యంత అవసరమని పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లులు పోషకాహారం తీసుకుంటే శిశువుకు అవసరమైన పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి బిడ్డకు అందించాలి అని సూపర్వైజర్ భవానీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భవాని, పోషణ్ అభియాన్ కిరణ్, హెల్త్ ఏ ఎన్ ఎమ్ ప్రభావతి, అంగన్వాడి టీచర్లు అనురాధ, కనక లక్ష్మి , బాలమణి, ఆశ వర్కర్ స్వరూప, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఛలో విజయవాడ ను విజయవంతం చేయండి -మధు ప్రసాద్

అనంతపురం ఆగస్టు 3, (విజన్ ఆంధ్ర): ఈనెల 11 తారీఖున దాదాపు 50 దళిత సంఘాల కమిటీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన పేద పిల్లలు బాగా చదవాలని దృఢ సంకల్పంతో ఆనాటి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఆ పార్టీ మొదటి ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి వాటికి వందల కోట్లను వెచ్చించడం జరిగిందని అన్నారు. అయితే కాలక్రమమైన రాష్ట్రంలో బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వాలు ఈ అంబేద్కర్ గురుకుల పాఠశాల మనుగడను మరచి అతిథి పరిస్థితులకు తీసుకురావడం చాలా బాధాకరమని వెంటనే అధికారపక్షం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మెరుగుపరిచి వాటికి కావాల్సిన నిధులను వెచ్చించి పేద విద్యార్థులకు బాసటగా నిలవాలని మధు ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఏజెన్సీ యాజమాన్యాలు చాలీచాలని జీతాలు ఇస్తూ ప్రభుత్వ జీవోలను సైతం బుట్ట దాఖలు చేస్తున్న సమ్మతిత అధికారులు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సైతం పేద విద్యార్థులకు దళితులకు విర్చించకుండా వాటిని పక్కదారి మళ్లించడం పై మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎస్సీ ఎస్టీ సబ్బుల నిధులను విడుదల చేసి విద్యార్థులకు దళితులకు సహకారం అందించే దిశగా చొరవ చూపాలని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ములకలేడు సోమందపల్లి మరూరూ వంటి ప్రాంతాలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని అయితే వాటి సరిపడా బడ్జెట్ ను కేటాయించ లేదని తక్షణమే ఆ నిధులను విడుదల చేసి ఆ పాఠశాలలను నూతనంగా నిర్మించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని తెలిపారు. సేవా సుప్రీం , రాపిడ్ ఏజెన్సీలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ సిబ్బంది కడుపు కొడుతున్నాయని సిబ్బందికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఈ ఏజెన్సీలు విఫలమయ్యాయని గతంలోనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయిందని అన్నారు. వెంటనే ఈ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకొని వాటిని బ్లాక్ లిస్టులో పెట్టి మంచి ఏజెన్సీలకు ఆ పాఠశాలల మౌలిక సదుపాయాల బాధ్యతలను ఇవ్వాలని మధు ప్రసాద్ ప్రభుత్వానికి విన్నవించారు. ఈ అనేకమైన సమస్యలపై ఈనెల 11వ తేదీ మంగళవారం ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాదాపు 50 సంఘాల కమిటీతో కలిసి చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బడుగు బలహీన వర్గాలు నాయకులు మేధావులు సంఘాల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నామని మధు ప్రసాద్ తెలిపారు.



# మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే సహాయం

పెబ్బేరు,ఆగస్టు 03 ( విజన్ ఆంధ్ర ) వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త బోరింగ్ రాముడు గత వారం రోజులుగా అనారోగ్యం తో బాధ పడుతూ అకాలంగా మరణించడం జరిగింది దహన సంస్కారాల నిమిత్తం తోమాలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎం ఎల్ ఏ తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మేఘన్న అభయ హస్తం కింద 5000 రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఉప సర్పంచ్ రాంబాబు మాజీ గ్రామ అధ్యక్షులు రంగన్న యాదవ్లైరెక్టర్ రామన్ గౌడ్ వార్డ్ మెంబర్ ఉమేష్ గౌడ్ మాజీ వార్డ్ మెంబర్ మహేష్ బాబు రమేష్ కుమార్ శివకుమార్ నెంబర్ రాముడు తదితరులు పాల్గొని నివాళులు అర్పించడం జరిగింది.

# మాజీ మంత్రిని కలిసిన వెల్దండ సర్పంచ్.

వెల్దండ ఆగష్టు 03 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కే.ఇ ప్రభాకర్ గౌడ్ సోమవారం శ్రీశైల దేవస్థానం శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయానికి దర్శానికి బయలుదేరుతున్న సందర్భంగా వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్, కాంట్రాక్టర్ కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్,నాయకులు మట్ట విష్ణు,పసునోజు పురుషోత్తం, మట్ట భరత్ గౌడ్, రాహుల్, సతీష్, మట్ట మల్లేష్ తదితరులు ఉన్నారు.

# చిన్నంబావి సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



చిన్నంబావి, ఆగస్టు 03:(విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లా చిన్నంబావి మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం మండల గ్రామ సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా వెలుగొండ సర్పంచ్ శరత్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, కమలా బాయి, ఉపాధ్యక్షులుగా నర్సింహ్మా, లీలవతి, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా శంకర్ తో పాటు కార్యవర్గ సభ్యురాలిగా దివ్యశ్రీలు బాధ్యతలు స్వీకరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, మండల సమగ్ర అభివృద్ధికి సర్పంచులందరినీ ఏకతాటిపైకి తెస్తూ నిరంతరం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలం: డి హెచ్ పి ఎస్

**దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్**



వనపర్తి బ్యూరో ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర ):కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలమైందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల వద్ద ధర్నా, వినతి పత్రాలు సమర్పించాలన్న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి కలెక్టర్ ఆఫీస్ లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దళితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ ఇచ్చి మూడేళ్లు కావస్తున్న ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు ప్రాధాన్య ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఇండస్ట్రియల్ రుణాలకు, సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. దళితులు సాగు చేస్తున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని ఎస్సీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వంపై పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు డి. శేఖర్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యుడు విశ్వం బాబు,మాజీ సర్పంచ్ శాంతన్న,సామాజిక నేత గంధం నాగరాజు,చిన్న కురుమన్న, రమేష్,వంశీ,సౌలు,రవి,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులు ఎదురుకుంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**- దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు రాసపెల్లి భద్రయ్య**

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03(విజన్ ఆంధ్ర )రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి (డి. హెచ్ పి ఎస్) రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ చేవెళ్ల డిక్లేషన్ హామీల అమలు తక్షణమే చేయాలి.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయస్థ పథకం ద్వారా 12 లక్షలు రూపాయలు ప్రతి దళిత కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి భూమి హక్కును కల్పించాలని రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలనిపేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించాలని అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాలి. ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలి.పోడు వ్యవసాయం చేస్తున్న దళితులకు తక్షణమే పట్టాలు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయవలసిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని వినయపూర్వకంగా కోరుతున్నామని రాసపెల్లి భద్రయ్య దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందుజేశారు.వారి వెంట జిల్లా మహిళా నాయకురాలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# స్నేహితునికి కుటుంబానికి ఆర్థిక సహాయం

వెల్దండ ఆగష్టు 03 (విజన్ ఆంధ్ర ) మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన కోఫూరి వినోద్ మండల కేంద్రంలోని పాఠశాలలో చదువు కున్నాడు.అనారోగ్యంతో వినోద్ మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి తిడుకుంటున్నాడు.1999 సంవత్సరం లో కలిసి చదువు కున్న తోటి స్నేహితులు 37 వేల రూపాయలను ఆరోగ్య ఖర్చుల కోసం సోమ వారం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిక్కుమాండ్ల,శ్రీనివాస్ రాకేష్,శేఖర్ మల్లి ఖార్జున్,విజయ చారి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ వివరాల నమోదును నిశితంగా పరిశీలించాలి

ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అందువల్ల బీఎల్వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని, లోపాలను గుర్తిస్తూ వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. అనవసర తప్పిదాలకు ఆస్కారం కల్పిస్తే సంబంధిత బీఎల్వోలు, సూపర్వైజర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్లో ఉందని, సూపర్వైజర్లు బీఎల్వోలతో నిరంతరం సమన్వయం చేసుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి గురించి తెలియజేయాలని అన్నారు. గైర్హాజరు, మృతి చెందిన, వలస వెళ్లిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను వచ్చే శనివారం వరకు పూర్తి చేయాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించామని తెలిపారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగతా సెగ్మెంట్లలో వివరాల నమోదు ప్రక్రియను పునః పరిశీలన జరిపిస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఊర పండగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదు



### నగర మేయర్ ఉమారాణి

నిజామాబాద్ ఆగస్టు 01:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్న సంప్రదాయ ఊరపండుగ ఏర్పాట్లకు సంబంధించి నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మరియు సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఊరేగింపు మార్గాల్లో మరియు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా ఉండాలని, వేడుకల సందర్భంగా ప్రధాన మార్గాలు, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, ఊరేగింపు సాగే దారుల్లో వీధి దీపాలు (లైటింగ్) అన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. భక్తులు మరియు ఊరేగింపు వెళ్లే మార్గాల్లో గుంతలను పూడ్చి, రోడ్లను సుగమం చేయాలని అధికారులకు ప్రతిపాదించారు. పండుగ నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, రక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

నగరపాలక సంస్థ అధికారులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, హెల్త్ క్యాంపులను సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద తాగునీటి చలివేంద్రాలు, నీడ కొరకు షామియానాలు ఏర్పాటు చేయనున్నారు.

నాయకులు ఒ కమిటీ సందేశం

నగర శాంతిభద్రతలకు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ ఊరపండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని; కార్పొరేషన్ యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు పండుగ ముగిసే వరకు పూర్తి సహకారాన్ని అందిస్తారని ఈ సందర్భంగా తెలపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్, సానిటరీ సిబ్బంది, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, కోఆప్షన్ మెంబెర్ నరేందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, బంటుబలరాం, ఆమ రాజు, లవంగ ప్రమోద్,అవీన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా విజయవంతం చేయాలి

### - బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

నిజామాబాద్ ఆగస్టు03:( విజన్ ఆంధ్ర) : ఇందూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ఇంచార్జి రాంనాథ్ గారు సమక్షంలో నిర్వహించిన సమావేశంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడమే కాకుండా, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేసి దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాలని సూచించారు.

అలాగే తిరంగా ర్యాలీలు, బైక్ ర్యాలీలు, యువతతో భారీ అవగాహన కార్యక్రమాలు, జాతీయ గీతాలాపన, దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించి, భారత త్రివర్ణ పతాక గౌరవాన్ని ప్రతి ఇంటికి చేర్చాలని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం దేశ సమైక్యతకు, జాతీయ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త కనీసం తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలను చైతన్యపరచాలని, యువతలో దేశభక్తిని మరింత బలోపేతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతనకార్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, మోర్చా అధ్యక్షులు ఓం సింగ్, వంశీ గౌడ్, వనిత, తిరుపతి రెడ్డి, కార్పొరేటర్లు శశాంక్, శ్రవణ్, యాదల నరేష్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ, జస్పాల్ సింగ్, గిరిబాబుతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలెంగ్రామంలో అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన

### - సర్పంచ్ బోనాసి రామకృష్ణ ప్రారంభం



నాగర్ కర్నూల్ బ్యూరో (విజన్ ఆంధ్ర) ఆగస్టు 03 సోమవారం : నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని పాలెం గ్రామపంచాయతీ 2వ వార్డుల గ్రామ అభివృద్ధి పనులలో భాగంగా అండర్ డ్రైనేజ్ పనులను సర్పంచ్ బోనాసి. రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. నరసింహ ఇంటి నుండి పోచమ్మ గుడి వరకు చేపట్టిన ఈ పనులను ఆయన జేసీబీ తో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...గ్రామంలోని ఇళ్లలోని మురుగునీరు మరియు వర్షపు నీటిని సురక్షితంగా బయటికి పంపడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. బహిరంగ కాల్వాల వల్ల వచ్చే సమస్యలను తొలగించి, దుర్వాసనలు రాకుండా, దోమలు మరియు రోగాలు ప్రబలకుండా చూడడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు పంచాయతీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందు, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, వార్డు మెంబర్లు శివకృష్ణ, కోట్ల. హేమలత, శ్రీకాంత్, చింతల పద్మ, గోవిందు కాశన్న, గ్రామ పెద్దలు ఎండి.ఖదీర్, బుర్రి సుదర్శన్ రెడ్డి, సోప్పరిబాలస్వామి, చంద్రారెడ్డి, బాపిరెడ్డి, దామోదర్, శ్రీశైలం, బుచ్చన్న, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల మహోత్సవానికి ఆహ్వానం



నిజామాబాద్ ఆగస్టు01:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ ఈరోజు గౌరవ పూజ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ హైదరాబాద్ నందు, మర్యాదపూర్వకంగా కలిసి, ఆగస్టు 5వ తేదీన టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించబోయే టీఎన్జీవో బోనాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేయవలసిందిగా ఆహ్వాన పత్రికను అందజేసి సాధరంగా ఆహ్వానించి అనంతరం జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించగా... సానుకూలంగా స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ , ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో నిర్వహించే టీఎన్జీవో బోనాల కార్యక్రమాలు నిర్వహించే టీఎన్జీవో అధ్యక్ష కార్యవర్గ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి, బోనాల ఉత్సవాలకు వస్తానని,మరియు జిల్లా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చినందుకు, టీఎన్జీవోస్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీ నాశెట్టి సుమన్ కుమార్ గారు, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్ గారు... వీరితోపాటు టిఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్ మరియు ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు శశికాంత్ రెడ్డి హాజరైనారు

# పి.హెచ్.ఎం. నూతన ప్రధాన కార్యదర్శి కి ఘన సత్కారం...

బోధన్, ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పి. నాగేశ్వరరావు, బోధన్ డివిజన్ కన్వీనర్ గా ఎన్నికైన సందీప్ లను ఘనంగా సత్కరించారు. జులై 31న నిర్వహించిన పీహెచ్ఎం జిల్లా శాఖ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంటాకలాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. నాగేశ్వరరావు ఏకగ్రీవంగా, బోధన్ డివిజన్ కన్వీనర్ గా సందీప్ జిపిఎస్ రాకాసిపేట ఎన్నికైన సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలో మండల విద్యాధికారి నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారిని పూల మాలలతో ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పి. నాగేశ్వరరావు ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హనుమంతు, సాయిలు, విజయలక్ష్మి, ఇందిరా దేవి, సత్తుబాయి గారితో పాటు బోధన్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# అర్హతలేని 'పోలీస్' కోచింగ్ సెంటర్లు ..

## - అధిక ఫీజు వసూలుతో కుచ్చుటోపీ

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు03(విజన్ ఆంధ్ర) : పోలీస్ కోచింగ్ పేరుతో కొన్ని అనధికార, ప్రైవేట్ అకాడమీలు నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. శిక్షణ పొందేందుకు వచ్చే నిరుద్యోగులకు నకిలీ అకాడమీలు గాలం వేస్తున్నాయి. సరైన వసతులు, నిపుణులైన ఫ్యాకల్టీ లేకుండా ప్రకటనలు గుప్పిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను ఆకర్షించి వేల రూపాయలు వసూలు చేస్తున్నాయి. నగరంలో అనేక అకాడమీలు పోలీస్ కోచింగ్ పేరిట అధికంగా ఫీజులు వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ కిషన్‌పుర, నయీంనగర్‌లు నకిలీ కోచింగ్ సెంటర్లకు కేంద్రంగా మారాయి. కనీస నిబంధనలు, ఎలాంటి అర్హత లేకుండా అకాడమీలను నిర్వహిస్తున్నారు.

రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా నిర్వహించాల్సిన అకాడమీ సెంటర్లు పోలీస్ యూనిఫాం వేసి డ్యూటీలో ఉంటున్నవారే ఉచిత సేవ చేయకుండా డబ్బులు తీసుకుని మరీ కోచింగ్ సెంటర్లు నడిపించడంపై మండిపడుతున్నారు. నాణ్యతలేని బోధన, అనుభవంలేని అధ్యాపకులతో నామమాత్రపు తరగతులు నిర్వహిస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వంద శాతం ఉద్యోగం ఇస్తామంటూ నకిలీ వాగ్దానాలు చేయడం, తప్పుడు హామీలు ఇచ్చి అకాడమీలు నిరుద్యోగుల నుంచి సొమ్ము చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 7 వేల పోస్టులతో పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వడంతో అకాడమీ నిర్వాహకుల పంట పండినట్లుగా భావిస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఊరి నుంచి నగరానికి వస్తున్న నిరుద్యోగులు అకాడమీల పేరుతో మోసం చేసే కేసుల నిర్వాహకుల వలలో పడుతున్నారు. పలువురు నిర్వాహకులపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎలాంటి అర్హతలేని వారు అకాడమీలతో నిరుద్యోగుల నుంచి ఫీజుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరంలోని పలు అకాడమీల నిర్వాహకులు వివిధ కేసుల్లో ఇరుక్కుని కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఎలాంటి నిబంధనలు పాటించకుండా 'క్యాష్' చేసుకుంటున్నారు. అనుభవనం లేని ఫ్యాకల్టీ, రిమూవల్ ఫర్ సర్వీస్ అయిన పోలీస్ అకాడమీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, కిషన్‌పురలో ఉన్న ఆయన దుకాణం వరంగల్‌కు మార్చినట్లు సమాచారం. మంచి అధికారుల వద్ద శిక్షణ తీసుకుని పోలీస్ ఉద్యోగం కొట్టాలనే తపనతో వచ్చిన నిరుద్యోగులు మోసపోతున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్ల బారినపడి మోసపోతున్నారు. ప్రభుత్వం లేదా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం మంచిదని పలువురు కోరుతున్నారు.



ఓ అకాడమీ పేరుతో పోలీసులు శిక్షణ పేరుతో దందా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. విధుల్లో ఉంటూ ఉచితంగా శిక్షణ ఇవ్వాల్సిన పోలీసులు హనుమకొండ కిషన్‌పురలో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. పోలీసు డ్రెస్ వేసుకుని చదువు చెప్పొద్దని నిబంధనలు ఉన్నా శిక్షణ ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీస్ డ్రెస్, గన్‌లతో కోచింగ్ ఇస్తున్నా టాస్క్‌ఫోర్స్?? పోలీసులు అటువైపు కన్నెత్తిచూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గన్నులు ? పట్టుకుని క్లాసులు చెప్పడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. నగరానికి వచ్చి అవగాహన లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అకాడమీల్లో చేరి మోసపోవద్దని, ఆలోచించి అడుగేయాలని నిరుద్యోగులకు పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు చెల్లించండి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర ) : గత మూడు నెలల పెండింగ్ ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో, అడిషనల్ పీడీని ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సమ్మెకు మాకు ఎలాంటి సంబంధం లేదని, మేము మాత్రం తమ విధుల్లో యథావిధిగా కొనసాగుతున్నమని చెప్పారు. గత మూడు నెలలుగా జీతాలు రాక కుటుంబాలు గడవక దుర్భర జీవితాలను గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి, కుటుంబాలను గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విధి నిర్వహణలో మాత్రం తమ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కావున ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, దానయ్య, +. నాగరాజు యమునా, ప్రేమలత,బాలరాజ్, యాదగిరి, దాసు, జంగయ్య, లింగస్వామి, జంగయ్య, రామలింగం,తదితరులు పాల్గొన్నారు.



# సరోగసీ దరఖాస్తులపై జిల్లా బోర్డు సమీక్ష

- సరోగసీకి అర్హత పొందిన దంపతులకు జిల్లా బోర్డు ధ్రువపత్రాల మంజూరు
- సమగ్ర పరిశీలన అనంతరం అర్హ దంపతులకు జిల్లా స్థాయి ధ్రువపత్రాల మంజూరు
- జిల్లా వైద్యాధికారి డా. కె. ఆనంద్ అధ్యక్షతన సమావేశం
- సరోగసీ (నియంత్రణ) చట్టం--2021 ప్రకారం దరఖాస్తుల పరిశీలన
- అర్హతలు, వైద్య ప్రమాణాలు, పత్రాలపై క్షుణ్ణ సమీక్ష
- అర్హులైన ఉద్దేశిత దంపతులకు జిల్లా స్థాయి ధ్రువపత్రాల మంజూరు
- గైనకాలజిస్టు, శిశు వైద్య నిపుణులు, సీఈఏ ప్రోగ్రామ్ అధికారి హాజరు
- పారదర్శకంగా చట్టబద్ధ విధానాల అమలుకు జిల్లా బోర్డు కట్టుబాటు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా సరోగసీ బోర్డు సమావేశం సోమవారం నిర్వహించారు. సరోగసీ (నియంత్రణ) చట్టం--2021 నిబంధనలు, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సరోగసీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్దేశిత దంపతుల (×త్వఅనవన జశీబజూశ్రీవం) దరఖాస్తులను సమావేశంలో సమగ్రంగా పరిశీలించారు. దరఖాస్తుదారుల అర్హతలు, సమర్పించిన అవసరమైన పత్రాలు, వైద్య నివేదికలు, చట్టబద్ధ



ప్రమాణాలను జిల్లా బోర్డు సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారించిన అనంతరం అర్హులైన దంపతులకు జిల్లా స్థాయి సర్టిఫికెట్లను జారీ చేశారు. సరోగసీ ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు ప్రతి దరఖాస్తును అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే అనుమతులు మంజూరు చేయడం ద్వారా చట్టం లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఈఏ ప్రోగ్రామ్ అధికారి డా. గీత, గైనకాలజిస్టు డా. మాధవీలత, శిశు వైద్య నిపుణులు డా. శివకుమార్ పాల్గొని దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. జిల్లా సరోగసీ బోర్డు నిర్ణయాలు చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్ హామీల అమలులో విఫలం: బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్

**- బీఆర్ఎస్ నాయకులపై అనవసరమైన ఆరోపణలు ఆపాలని హెచ్చరించిన జిల్లపెల్లి వెంకటస్వామి**

బెల్లంపల్లి, ఆగస్టు 3 విజన్ ఆంధ్ర: సోమవారం బెల్లంపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్వి

జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ విమర్శించారు

రాష్ట్రంలో విద్య, ఉపాధి, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వీడి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకులపై అనవసరమైన ఆరోపణలు ఆపాలని హెచ్చరించిన జిల్లపెల్లి వెంకటస్వామి

ఈ సందర్భంగా మాట్లాడుతూ,

కన్నాలో ఒక హత్య కేసులో తన ప్రమేయం ఉందంటూ కాంగ్రెస్ నాయకుడు కుంబాల రాజేష్ చేసిన ఆరోపణలను ఖండించారు. గతంలో తనను సంబంధం లేని హత్య కేసులో మీ కాంగ్రెస్ నాయకులే ఇరికించారని, అనంతరం ఆ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అలాగే కుంబాల రాజేష్‌పై కూడా పలు ఆరోపణలు చేస్తూ, ఆయనపై వివిధ కేసులు నమోదయ్యాయని, జైలుకు కూడా వెళ్లారని విమర్శలు చేసారు. అలాగే, తనకు సంబంధం లేని విషయాలపై లేదా బీఆర్ఎస్ పార్టీ, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆధారాలు లేకుండా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిస్పందిస్తారని పేర్కొంటూ, ఇకపై నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కుంబాల రాజేష్‌కు సూచించారు.

మైనారిటీ నాయకులు ఎండి హనీఫ్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీ ల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు, బెల్లంపల్లి మైనారిటీ నాయకులకు పదవులు ఇచ్చిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ప్రభుత్వం ఏర్పడి 33నెలలు గడిచిన బెల్లంపల్లి లో మైనారిటీ పదవులు లేని నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ ని మాజీ ఎమ్మెల్యే పై వాక్యలు చేయడం విడ్డురంగా ఉందని, ఎలాంటి పదవులు లేని నాయకులు ఇలాంటి ఆ సందర్భ వాక్యలు చేయడం మానుకోవాలని అన్నారు

ఈ సమావేశంలో సబ్బని అరుణ్,హనీఫ్ రాజేష్, గోపి, సాయి, చరణ్, రవితేజ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతుండ్ల పేదలకు ఇంటి స్థలాల సర్వేకు ఎమ్మెల్యే హామీ



= వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి హద్దులు నిర్ణయిస్తామని హామీ

= 167 మంది లబ్ధిదారులకు త్వరలోనే పట్టా సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడి

= ప్రభుత్వ భూమి పరిరక్షణకు అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

= ఎమ్మెల్యే స్పందనపై సీపీఎం నాయకుల హర్షం.. ప్రత్యేక ధన్యవాదాలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర ): నియోజకవర్గంలోని చిన్నతుండ్ల గ్రామంలో సర్వే నెం.327లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను లబ్ధిదారులకు చూపించి, ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సీపీఎం చిన్నతుండ్ల గ్రామ కమిటీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరింది. ఈ సందర్భంగా సమర్పించిన వినతిపత్రంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, 167 మంది లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు త్వరలోనే అందజేస్తామని, వారం రోజుల్లో 5 ఎకరాల 10 గుంటల భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మార్వోకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే స్పందనపై సీపీఎం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి మస్కు మహేందర్‌తో పాటు మస్కు విజయ్‌కుమార్, సామర్తి జగన్, ఆకుల భిక్షపతి, మస్కు జ్యోతి, మస్కు నర్సింహ, బొర భూషణ్, నాగని రవికుమార్, నాగని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సక్రమంగా పనిచేయని ఈసిజి యంత్రం



- కార్డియాలజిస్ట్ వైద్యులులేని ఆసుపత్రి
- రాత్రి సమయంలో సక్రమంగా పనిచేయని ఒక్కే ఈసిజి యంత్రంతో కాలం గడుపుతున్న వైద్య సిబ్బంది
- వివిధ పరీక్షలు వచ్చే రోగులకు పరికరాలు పని చేస్తలేవంటూ ప్రైవేటు ఆసుపత్రికి మళింపు
- దీనికి ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపలే కారణమా
- గుండెకు సంబంధించిన వైద్యులు అందుబాటులో లేక మహబూబ్నగర్ హైదరాబాద్ కి వెళ్తున్న సామాన్య ప్రజలు
- ఇకనైనా ఆసుపత్రిలో శాశ్వత కార్డియాలజిస్ట్ వైద్యులను ఏర్పాటు చేయాలని సామాన్య ప్రజల విజ్ఞప్తి

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 03 సోమవారం : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రాత్రిపగలు తేడా లేకుండా ఎందరో సామాన్య ప్రజలు నిత్యం వస్తూ ఉంటారు. వీరికి సంబంధించిన వైద్యులు అందుబాటులో లేక, సిబ్బంది సమయపాలన పాటించక ఆలస్యంగా వచ్చిన సిబ్బంది, సామాన్య ప్రజలకు ఇబ్బందులు పెడుతూ... గైకాలజీ స్కానింగ్లు, ఈసీజీ యంత్రాలు సక్రమంగా పనిచేస్తలేవంటూ ప్రైవేట్ ఆసుపత్రిలలో తీసుకోవాలంటూ ప్రైవేట్ హాస్పిటల్ వారు ఇచ్చే కమిషన్లకు ఆశపడుతూ సామాన్య ప్రజలను తరలిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో అత్యవసర గదిలో అరకొర పనిచేసే ఒకే ఈసిజి యంత్రంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇది ఇలా ఉండగా జిల్లాలో కేంద్ర బిందువుగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యవసర సేవలలో భాగంగా గుండెకు సంబంధిత చికిత్సలకు వచ్చే రోగులకు కార్డియాలజిస్ట్ డాక్టర్లు లేక, చికిత్స నిమిత్తం మహబూబ్నగర్, హైదరాబాద్ కు వెళ్ళవలసి వస్తుంది. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి అత్యాధునిక పరికరాలను, శాశ్విత కార్డియాలజిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

-ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

-సర్పంచ్ దుబ్బాసి భవాని బాలకిషన్



మర్కుక్ ఆగస్టు 03,(విజన్ ఆంధ్ర ) : సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో అంగన్వాడీ 3వ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడీ ఉపాధ్యాయులు సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు.తల్లిపాలు బిడ్డలకు సంజీవనితో సమానమని,బిడ్డ పుట్టిన ఒక గంటలోపు ముర్రు పాలు పట్టించాలని,ప్రతి తల్లి తమ బిడ్డలకు ఆహారం తీసుకున్నప్పటికీ కనీసం 2 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ పాటు తల్లి పాలివ్వాలని,తల్లికి పౌష్టికాహారం,విశ్రాంతి,కుటుంబ సహకారం అవసరమని అంగన్వాడి ఉపాధ్యాయులు జి.సంతోష,యు.సుజాత,యండి.జైబున్నిసా గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు,వారి అత్తలకు అవగాహన కల్పించారు.తల్లిపాల వారోత్సవాలలో గ్రామ సర్పంచ్ దుబ్బాసి భవాని బాలకిషన్,ఉప సర్పంచ్ జుట్టు సుధాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యాన్ని బాలింతలకు,గర్భిణీలకు వారు వివరించారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనన్నీ తనిఖీ చేశారు.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్,వార్డు సభ్యులు మ్యాకల శ్రీనివాస్,కొండనోల్ల లక్ష్మీ నరేష్,ఏఎన్ఎం సుగుణ,ఆశా వర్కర్ అనిత,గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేసి.. చనిపోయాక రాజకీయాల కోసం వాడుకుంటున్న డ్రామారావు

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 03(విజన్ ఆంధ్ర ) పదేండ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించింది బిఆర్ఎస్ పార్టీ నే.సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు..?పెద్ది సుదర్శన్ రెడ్డి ని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం... అధికారం, కీలక పదవులన్నీం టినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం. కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య.



మరణాలను సైతం రాజకీయ లబ్ది కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం.భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి - ముకిరాల మధు వంశీకృష్ణ.

# ప్రజావాణికి 8 దరఖాస్తులు..

చేవెళ్ళ, ఆగస్టు 03 (విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు ప్రతి సోమవారం చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ప్రజావాణికి డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, పింఛన్లకు సంబంధించి ఆరు దరఖాస్తులు అందగా, మొత్తం ఎనిమిది వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల మేరకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ఎరువుల విక్రయ ఫ్రేమవర్క్ పై రైతులకు అవగాహన కార్యక్రమం

-మర్కుక్ మండల వ్యవసాయ అధికారి రాము

మర్కుక్ ఆగస్టు 03,(విజన్ ఆంధ్ర ) : సిద్దిపేట జిల్లా మర్కుక్ రైతు వేదికలో ఎరువుల డీలర్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ వెబెక్స్ ద్వారా ఎఫ్ ఎఫ్ ఎస్ (ఫ్రేమ్ వర్క్ ఫార్టిలైజార్ ఫర్ సేల్ ) యాప్ వినియోగంపై సోమవారం నాడు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము మాట్లాడుతూ ఆగస్టు 6వ తేదీ నుండి మర్కుక్ మండలంలో ఎఫ్ ఎఫ్ ఎస్ ఫ్రేమవర్క్ ఫర్టిలైజర్ యాప్ అమలులోకి రానుందని తెలిపారు.అన్ని ఎరువుల డీలర్లు తప్పనిసరిగా ఈ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు నిర్వహించాలని సూచించారు.యాప్ వినియోగ విధానం,రైతుల వివరాల నమోదు,ఎరువుల విక్రయ ప్రక్రియ,నిబంధనలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించబడింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు,మర్కుక్ మండలంలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని వెంటనే ప్రకటించాలి

అక్కన్నపేట ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : రాష్ట్రంలో 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జీఓ నెం. 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రామనాథరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

# ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి.

**--తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి.**

**--12వ వార్డులో ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ శ్రీకారం.**

తాండూరు ఆగస్ట్ 3 (విజన్ ఆంధ్ర) తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో తాండ్రు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు చైర్పర్సన్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతతో పాటు అన్ని వయసుల వారు వ్యాయామం చేసేలా ఓపెన్ జిమ్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

లక్షెట్టిపేట ఆగష్టు, 03(విజన్ ఆంధ్ర ): పట్టణంలోని తిలక్ నగర్ కు చెందిన రాపల్లి రమేష్(45) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి, చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, మృతునికి చేపలు పట్టే అలవాటు ఉందన్నారు. నిన్న సాయంత్రం మహాలక్ష్మి వాడలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదన్నారు. ఉదయం చెరువులో మృతదేహం కనిపించగా సమాచారం అందుకున్న కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా, చెరువు నీటిలో చనిపోయి ఉన్నాడని తెలిపారు. మృతుడు చేపలను పట్టడం కోసం చెరువు నీటిలో వలవేయగా, వల ఆయన కాలికి,చేతికి చిక్కుకొని అదే చెరువులో పడి మృతి చెందాడన్నారు. మృతుని తల్లి బుచ్చి రాజవ్వ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అన్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు అవగాహన

**- ముర్రుపాలు నుంచి అనుబంధ ఆహారం వరకు శిశు పోషణపై సూచనలు**

నంగునూరు మండలం ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శనిగరం స్వాతి బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, శిశు పోషణ, వ్యక్తిగత పరిశుభ్రతపై తల్లులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గర్భధారణ దశ నుంచి శిశువు రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కాలంలో నీరు సహా ఇతర పానీయాలు లేదా ఆహారం ఇవ్వకూడదని వివరించారు.

ఆరు నెలలు పూర్తైన తర్వాత పోషక విలువలు కలిగిన అనుబంధ ఆహారం ప్రారంభించి, రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను



కొనసాగించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శిశువుల ఎదుగుదలను పర్యవేక్షించేందుకు ప్రతి నెలా ఎత్తు, బరువు కొలవడం అవసరమని తెలిపారు.

కార్యక్రమంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం తల్లులకు శిశు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై పలు సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగరం స్వాతి బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, వార్డు సభ్యురాలు ఆకుల భారతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, బాలల సంరక్షణ అధికారి రమేష్, డాక్టర్ శివకిషోర్, హెల్త్ అసిస్టెంట్ లింగం, ఏఎన్ఎం రేణుక, అంగన్‌వాడీ టీచర్లు విజయ, ఉత్తర, వీఓఏ మౌనిక, తల్లులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ లోని బంకిపూర్‌లో బీజేపీ కంచుకోట బద్దలు

**- ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం -మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 3 : బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో బీజేపీకి ఎదురైన ఘోర పరాజయం దేశ రాజకీయాల్లో కీలక పరిణామమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సొంత నియోజకవర్గంగా పేరొందిన బంకిపూర్‌లో,బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ఓటమిపాలవడం ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పుకు నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా బీజేపీ కంచుకోటగా ఉన్న బంకిపూర్‌లో భారీ మెజారిటీతో జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారని, ప్రజలు తమ తీర్పుతో బీజేపీ అహంకారానికి గట్టి సమాధానం చెప్పారని పేర్కొన్నారు. దేశంలో తమకు ఎదురే లేదని, ప్రజలు తమ వెంటే ఉన్నారని విర్రవీగుతున్న బీజేపీకి బంకిపూర్ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా గుణపాఠం చెప్పారు. అధికార బలం, ప్రభుత్వ యంత్రాంగం, ప్రచార ఆర్భాటం ఎంత ఉన్నా ప్రజల తీర్పును ఎవరూ మార్చలేరని ఈ ఎన్నిక మరోసారి నిరూపించింది అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీకి పునాదులే కదిలిపోతున్నాయనే సంకేతాలను బంకిపూర్ ఉపఎన్నిక ఫలితం స్పష్టంగా వెల్లడించిందన్నారు. ప్రజల సమస్యలను విస్మరించి, అహంకారపూరిత పాలన కొనసాగిస్తే ప్రజలు సరైన సమయంలో తగిన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఉద్యమం దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న అసంతృప్తికి



ప్రతీకగా నిలిచిందన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం విఫలమవుతోందనే భావన ప్రజల్లో బలపడుతోందని తెలిపారు. బంకిపూర్‌లో వచ్చిన తీర్పు కేవలం ఒక నియోజకవర్గ ఎన్నికల ఫలితం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలనే ప్రజల సంకల్పానికి ప్రతీక అని మంత్రి అన్నారు. ప్రజల గొంతుకను అణచివేయాలని ప్రయత్నించే రాజకీయాలకు దేశ ప్రజలు తగిన సమయంలో సరైన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజల తీర్పే అంతిమం. బంకిపూర్‌లో బీజేపీ కంచుకోట బద్దలవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం. ఇదే ప్రజా చైతన్యం రాబోయే రోజుల్లో దేశ రాజకీయాల్లో మరింత పెద్ద మార్పుకు నాంది పలుకుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఈనెల 6 నుండి శ్రీ కాళికా దేవి బోనాల ఉత్సవాలు

**--9న బోనాల ఉత్సవాలు,10 న అమ్మవారి ఉత్సవ ఊరేగింపు**

**--ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి,**

**--వెల్లడించిన ఆలయ ఈవో టి. నరేందర్.**

తాండూరు ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర) ఈనెల 6 నుండి పట్టణంలోని శ్రీ కాళికాదేవి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నయని ఆలయ కార్యనిర్వాక అధికారి ఈవో టి నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 9వ తేదీ ఆదివారం రోజున ఉ. 5-00 గం.లకు నుండి సుప్రభాతం, ఉ. 6-00 గం.లకు ఘటస్థాపన

ఉ. గం. 7-05 ని.ల నుండి భజనమండలి వారిచే కాగ్నానది నుండి జలము తెచ్చుట,ఉ. గం. 7-30 ని.ల నుండి కాగ్నానది జలముతో అమ్మవారికి అభిషేకము ఉ. గం. 11-05 ని.లకు గంగాపూజకు బయలుదేరుట మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి బోనాలు మధ్యాహ్నం 01 గంటలకు ముదిరాజ్ సంఘం వారిచే అన్నప్రసాద వితరణ,సా. గం 4-30 ని.లకు రంగం ఎక్కే కార్యక్రమం, పోతురాజు ఆట, కథాకాలక్షేపము కలదు.



10న సోమవారము రోజున ఉ. 6-00 గం.లకు నుండి పూజాకార్యక్రమము, కుంకుమార్చన జరుగును.

ఉ. గం. 10-05 ని.ల నుండి శ్రీ లలితా సహస్రనామ పారాయణము,మధ్యాహ్నం 01 గంటలకు దేవస్థాన కిరాయిదారులచే అన్న ప్రసాద వితరణ,3-05 అమ్మవారి ఉత్సవసేవ - ఊరేగింపు జరుగుతుందని ఆలయ ఈవో తెలిపారు. ఇట్టి ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కావున పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొని శ్రీ కాళికా దేవి మాత అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాలను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## టైగర్ జోన్ రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి

### – బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ డిమాండ్

జన్నారం, ఆగస్ట్ 03 ( విజన్ ఆంధ్ర) : కవ్వాల్ టైగర్ జోన్



పేరుతో ఆదివాసీ, గిరిజనులపై అటవీ శాఖ అధికారులు వికృత చేష్టలకు పాల్పడుతున్నా రని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మండిపడ్డారు. నైజాం ప్రభుత్వ పాలనను తలపి స్తున్నాయని ఆరోపించారు.సోమవారం ఆయన ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉడుంపూర్, ఇంద న్పెల్లి గ్రామాల్లో చేపల వేటకు వెళ్లిన ఆదివాసీల ను అటవీ అధికారులు విచక్షణారహితంగా కొట్టిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడి రాబోయే అ సెంబ్లీలో కవ్వాల్ టైగర్ జోన్ రద్దుకు తీర్మానం చే యాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎంపీలతో కలిసి ఒప్పిస్తామని, టైగర్ జోన్ రద్దు కోసం పార్టీలకతీతంగా అందరం ఉద్యమించాలని పి లుపునిచ్చారు. ఆదివాసీ, గిరిజనుల ఆస్తిత్వాన్ని కాపాడుకోవాలని,అటవీ శాఖకు ఎవరూ సహకరిం చవద్దన సహాయ నిరాకరణ ఉద్యమంతో ముందు కు వెళ్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు,రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అజ్మీర బద్రి నా యక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొంతం శంకరయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి బుర్రగడ్డ జగన్, పోన కల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి,ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బోద తిరుపతి,బీజేవైఎం మండల అధ్యక్షుడు కందుల రమేష్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రాజారావు,గూడ గంగాధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్ర త్రిశతి హోమ పూజ

హైదరాబాద్ పాతనగరంలోని చరిత్రాత్మకమైన హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి మందిరంలో 78వ వార్షిక బోనాల ఉ త్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయంలో అమ్మవారికి బిల్వార్చన అనంతరం రుద్ర త్రిశతి హోమం పూజలను ఆలయ కమిటీ కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.పీ.క్రాంతి కుమార్ ఆయన సతీమణి ఎస్.శైలజతో కలసి ఘనంగా నిర్వహించారు.

ఆలయ పూజారులు కె.రవినారాయణ మూర్తి మరియు గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.



## హైదరాబాద్‌లో ఘనంగా 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్

– కెడిఆర్ అకాడమీ హవా

– టైక్వాండో, కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో 100ం పతకాలు –

– బాలికలు భారీగా పాల్గొని ప్రతిభ చాటారు..

హైదరాబాద్,ఆగష్టు 03,విజన్ ఆంధ్ర: టైక్వాండో, కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో భాగంగా ప్రపంచ స్థాయిలో నిర్వహించిన 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్–2026 హైదరాబాద్ చంపాపేట్ లోని లక్ష్మి గార్డెన్‌లో ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి బాల, బాలికలు, యువతి, యువకులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్ని విభాగాల్లో తమ ప్రావీణ్యతను చాటుకున్నారు.

**సినీ హీరో డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో నిర్వహణ**

ఈ కార్యక్రమం సినీ హీరో డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధు యాష్కీ పాల్గొని విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.

**కెడిఆర్ అకాడమీ టాప్**

ఈ పోటీల్లో హబ్సిగూడకు చెందిన కె.డి.ఆర్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 22 బంగారు,45 వెండి, 36 కాంస్య పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు దయాకర్ రావు మాట్లాడుతూ.. "యువతకు చదువుతో పాటు శారీరక దృఢత్వం చాలా ముఖ్యం. టైక్వాండో, కుంగ్ ఫూ, కరాటే ద్వారా శరీర దారుఢ్యం




పెరగడమే కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించే సామర్థ్యం వస్తుంది" అని తెలిపారు.

ఈ ఛాంపియన్‌షిప్‌లో బాల బాలికలతో పాటు యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. విజేతలను నిర్వాహకులు అభినందించారు.

## ఆదివాసీ యువకులపై అటవీ అధికారుల దాడి

–అదుపులో ఉన్న ఆదివాసీ యువకులను విడిచి పెట్టాలంటూ రాస్తారోకో

–నిర్మల్ – మంచిర్యాల ప్రధానరహదారిపై మూడు గంటలకు పైగా నిలిచిన వాహనాల రాకపోకలు.

జన్నారం,ఆగస్టు3(విజన్ ఆంధ్ర) : కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధికి చెందిన జన్నారం డివిజన్ ఇంధన పెల్లి రేంజ్ లోని అటవి ప్రాంతంలోకి ఆదివారం రో జున చేపల వేటకు వెళ్లిన నాయకపు గూడకు చెం దిన ఆరుగురు ఆదివాసీ యువకులు మోతే అనిల్, బోసిని కృష్ణ, మోతే చంటి, మోతే మల్లేష్, రాయి శ్రీను, విష్ణు లపై అటవీ శాఖ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అందులో నుండి విష్ణు తప్పించుకొని వచ్చి గూడపు వాసుల కు తెలియజేయడంతో ఆదివాసీలంతా కలిసి అట వీ శాఖ కార్యాలయంలోకి చొరబడి కుర్చీలు విరగొ ట్టి,రికార్డులను చిందరవందర చేశారు. అనంతరం అటవి శాఖ అధికారుల అదుపులో ఉన్న తమ ఆదివాసీలను విడిచి పెట్టాలని కోరుతూ ఆదివారం రాత్రి 8 గంటల నుండి 11:30 గంటల వరకు దాదాపు మూడు గంటల పైగా భారీ రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా వాహనాలు స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి.అటవీ శాఖ అధికారుల అదుపులో ఉన్న తమ ఆదివా సీలని వెంటనే విడిచి పెట్టాలని, వారిపై చేయి చేసు కున్న రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ వెంటనే స స్పెండ్ చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించా రు.ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల జిల్లా ఏసీపీ ప్రకాష్, లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి ,జన్నా రం, దండేపల్లి ఎస్.ఐలు ఉదయ్ కిరణ్,రాజ వర్ధన్ లు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఎలాంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్,ఉట్నూర్ ఐటిడిఎ పీవో మందా మక రందం,జిసిసి ఛైర్మెన్ కొట్నాక తిరుపతి లు అక్కడికి చేరుకొని వారిని వివరాలు అడిగి తెలుసుకున్నా రు.ఐటీడీఏ పీవో మందా మకరందం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ లు డిఎఫ్ఓ మరియు ఎఫ్డిపిటి తో ఫోన్లో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొ జ్జు పటేల్ చేపల వేటకు వెళ్లిన ఆదివాసీలపై దాడి చేసిన రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని వారి అదుపులో ఉన్న ఐదుగు రుని వెంటనే విడిచి పెట్టాలని కోరగా అదుపులో ఉన్న ఐదుగురిని వెంటనే విడిచిపె డతామని, ఘటనపై విచారణ జరిపి 24 గంటల్లో ఎఫ్ఆర్వో పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అటవీ శాఖ అధికారుల అదుపులో ఉన్న ఐదుగురిని అట వీశాఖ వారు విడిచిపెట్టడంతో వారు అక్కడికి చేరుకొని జరిగింది అంత ఎమ్మెల్యేకి వివరించారు .ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ అటవి శాఖ అధికారులు ఆగడాలు రోజురోజుకు మరింత పెరు గుతున్నయని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం కోసం ఇసుక తీసుక వస్తే అక్రమంగా వారి పై జరిమానాలు విధించడం కాకుండా కేసులు న మోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నా రని అన్నారు. వాగుల నుండి, గోదావరి నుండి ఇ సుక తీసుకురాకపోతే ఇళ్ల నిర్మాణం ఎలా చేపడు తారని, సిసి రోడ్ల నిర్మాణం ఎలా పూర్తవుతాయని ప్రశ్నిస్తూ ఆగ్రహించారు. 24 గంటల్లో అధికారిపై చ ర్యలు తీసుకుంటామని అటవీ శాఖ ఉన్నత అధి కారులు హామీ మేరకు,నాయకపు గూడపు వాసు లకు ఎమ్మెల్యే తెలియజేయడంతో వారు రాస్తా రోకో విరమింపజేసి శాంతించారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

ప్రజల సమస్యల పరిష్కారమే అధికారుల తొలి బాధ్యత : అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

– మేడ్చల్––మల్కాజిగిరి ప్రజావాణిలో 128 వినతుల స్వీకరణ

–తిరస్కరించిన దరఖాస్తులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలన్న సూచన

– ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశం

– ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అధికారులకు హితవు

– ప్రజావాణిలో పాల్గొన్న వివిధ శాఖల జిల్లా అధికారులు


కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర): ప్రజావాణిలో స్వీకరించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని, ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 128 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే విశ్వాసంతో ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును ఆలస్యం చేయకుండా పరిశీలించి, అర్హత మేరకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా, వివరంగా తెలియజేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి దరఖాస్తుపై చేపట్టిన చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల వినతులను స్వీకరించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టారు.

## అక్షరమే ఆయుధంగా అక్రమార్కులను వణికించిన పాత్రికేయుడు

# ఇకలేరు....

## మందా సత్యానందం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం...

బోనకల్ ఆగస్టు 3 విజన్ ఆంధ్ర : సమాజంలో జరుగుతున్న అక్రమాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ అక్షర సత్యాన్ని కాపాడడంలో ఎప్పుడూ ముందుండే విజన్ ఆంధ్ర విలేఖరి గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన మందా సత్యానందం సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. బోనకల్ బ్రిడ్జి దౌన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్‌సైకిళ్ల ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన ప్రాణాలు కోల్పోవడంతో పాత్రికేయ లోకం శోకసంద్రంలో మునిగిపోయింది. అక్షరమే ఆయుధంగా చేసుకుని అక్రమార్కులను వణికిస్తూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ అక్షర సత్యాన్ని ప్రజల ముందుంచిన ధైర్యవంతుడైన పాత్రికేయుడు ఇక లేరనే వార్తను సహచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిజం కోసం కలం పట్టిన ఆయన చేతులు ఇక కదలవనే వాస్తవాన్ని సరస్వతి తల్లే తట్టుకోలేకపోతుందేమో అనిపించేంతగా ఈ విషాదం ప్రతి పాత్రికేయ హృదయాన్ని కలచివేసింది. ఆయన ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులకే కాదు పాత్రికేయ రంగానికి ఆయనను అభిమానించిన ప్రతి ఒక్కరికీ తీరని లోటుగా మిగిలింది. సత్యానందం మృతి పట్ల పాత్రికేయులు ప్రజాప్రతినిధులు స్నేహితులు వివిధ వర్గాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన కలం ఆగిపోయినా ఆయన రాసిన అక్షరాలు ప్రజల పక్షాన వినిపించిన స్వరం సత్యం కోసం చేసిన పోరాటం చిరకాలం చిరస్మరణీయంగానే నిలిచిపోతాయని సహచర పాత్రికేయులు కన్నీరుమున్నీరుగా నివాళులర్పించారు.




## అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా

# ఏకగ్రీవ ఎన్నిక

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, ఆగస్ట్ 03,విజన్ ఆంధ్ర:



అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన సౌట కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆయనను ఈ పదవికి నియమించారు.

ఈ సందర్భంగా సౌట కుమార్ మాట్లాడుతూ..

"ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారి మీద ఉన్న అభిమానంతో మునుముందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడతాం. రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, వృద్ధాశ్రమాలకు సహాయం వంటి కార్యక్రమాలు చేసి అల్లు అర్జున్ గారి పేరు నిలబెడతాం" అని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అల్లు అర్జున్ కు మరియు రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎన్నిక పట్ల అల్లు అర్జున్ ఫ్యాన్స్, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బన్నీ ఫ్యాన్స్ అందరూ కలిసి ఘనంగా స్వాగతం పలికారు.

## ఒకే కుటుంబంలో తండ్రికి కొడుకుకు ప్రభుత్వ భూమి ఎలా కేటాయిస్తారు?.

### కాగితాలు మార్చి పేరు మార్పిడి చేసుకున్న శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు?

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 3 : హుస్నాబాద్ పట్టణంలో అప్పటి ప్రభుత్వం 1970 వ సంవత్సరంలో కొన్ని నిరుపేద కులాలకు భూములు కేటాయించింది. ఇందులో భాగంగా చాత్తాద శ్రీవైష్ణవులు అయినా వరయోగుల రామానుజం మరియు వరయోగుల లక్ష్మయ్య గార్ల పేరు మీద రెండు ఎకరాలు కేటాయించింది. వరయోగుల రామానుజం పేరు మీద ఉన్న ఎకరం భూమిని లక్ష్మయ్య చిన్న కుమారుడైన వరయోగుల శ్రీనివాస్ దొంగతనంగా కాగితాలు మాయం చేసి తన పేరు మీదకు మార్చుకున్నాడని వీరి కులస్తుడైన వరయోగుల అనంతస్వామి ఆరోపించారు. ఇదేమిటని శ్రీనివాసును అడిగితే నాకు ప్రభుత్వం భూమి కేటాయించిందని చెప్తున్నాడు. వరయోగుల లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు సుదర్శన స్వామి శ్రీనివాస్ స్వామి. వీరి తండ్రికి చెందిన ఎకరం భూమి వీరికి ఉండగా మళ్లీ ప్రభుత్వం 1969 జీవో ప్రకారం 1999 లో శ్రీనివాస్ కు ఎలా భూమికేటాయిస్తుందని మేం అధికారులను ప్రశ్నిస్తున్నమన్నారు. దీనికి సమాధానం చెప్పాలి. వరయోగుల రామానుజం కు చెందిన ఎకరం భూమిని అక్రమంగా మార్పిడి చేసుకున్న వరయోగుల శ్రీనివాస్ పై చర్యలు తీసుకొని భూమి సర్వే నెంబర్ 762/ 8 ని పట్టా రద్దు చేయాలని కోరుతూ ఈ విషయంలో సోమవారం రోజున ప్రజావాణి సందర్భంగా హుస్నాబాద్ ఆర్డీఓకి బాధితుడు వరయోగుల అనంతస్వామి ఫిర్యాదు చేశారు. అన్యాక్రాంతంగా మాకు సంబంధించిన భూమిని అనుభవిస్తున్న శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని మా తాత రామానుజం పేరు మీద ఉన్న భూమిని యధా విధిగా మాకు కేటాయించాలని అధికారులను కోరారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో వరుస సంచలనాలు"

- వివాహితతో అక్రమ సంబంధం, దాడి, బెదిరింపులు -
- అశోక్‌నగర్ గదిలో కీలక ఆధారాలు..
- శిక్షణ సమయంలోనే వివాదాలు -
- సహచర ట్రైనీల ఫిర్యాదులు...

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, ఆగష్టు03,విజన్ ఆంధ్ర:దేశ సేవ చేయాల్సిన ఖాకీలోకి వచ్చి వివాదాల్లో చిక్కుకున్నాడు ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారి. ఉదయ్ కృష్ణారెడ్డిపై జరుగుతున్న విచారణలో రోజుకో కొత్త కోణం బయటపడుతోంది. వివాహితతో అక్రమ సంబంధం, దాడి ఆరోపణలు, శిక్షణలో విపరీత ప్రవర్తన వంటి అంశాలు వెలుగులోకి రావడంతో పోలీసు శాఖలోనూ చర్చ జరుగుతోంది.

ఎలా మొదలైంది?

2023 నుంచి భర్తకు దూరంగా కుమారుడితో ఉంటున్న ఓ మహిళకు ఉదయ్ కృష్ణారెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటికే 2014లో ఆమెకు వివాహమైనప్పటికీ, ఉదయ్ కృష్ణారెడ్డితో సన్నిహితంగా మెలిగినట్లు విచారణలో తేలింది.

హైదరాబాద్‌కు వచ్చి కొంతకాలం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఆమెను, ఉదయ్ కృష్ణారెడ్డి తన మాటలతో ఒప్పించి ఉద్యోగం మాన్పించాడు. ఆ తర్వాత అశోక్‌నగర్‌లోని ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించినట్లు సమాచారం. సివిల్స్ సాధించాలన్న ఆశతో ఆమె అక్కడికి వచ్చింది.

లివ్-ఇన్ వివాదం – దాడి ఘటన

ఈ క్రమంలో లివ్-ఇన్ రిలేషన్‌లో ఉండాలని ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. అయితే తనకు ఇంకా విడాకులు కాలేదని చెప్పి ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అశోక్‌నగర్‌లోని గదిలో ఇద్దరి మధ్య మాటల తూటాలు పేలాయి. కోపంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెపై దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటన తర్వాత ఆమె ఉదయ్ కృష్ణారెడ్డితో అన్ని సంబంధాలను తెంచుకుంది.

గదిలో దొరికిన కీలక ఆధారాలు

ఫిర్యాదు అందుకున్న పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి ఉంటున్న గదిలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్, రెండు ప్రేమలేఖలు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆధారాలను ఫోరెన్సిక్ పరిశీలనకు పంపినట్లు సమాచారం. మొబైల్ లోని చాట్‌లు, కాల్ డేటాను కూడా పోలీసులు విశ్లేషిస్తున్నారు.

ట్రైనింగ్‌లోనూ వివాదాస్పదం

అకాడమీలో శిక్షణ సమయంలోనే ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన సరిగా లేదని పలువురు సహచర ట్రైనీలు ఆరోపిస్తున్నారు. చిన్న విషయాలకే కోపం, అధికార దర్పం ప్రదర్శించడం, ఇతర ట్రైనీలతో గొడవపడటం వంటి ఘటనలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో కొంతమంది ట్రైనీలు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం.

పోలీసుల దర్యాప్తు

ప్రస్తుతం ఈ కేసును ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని, వైద్య పరీక్షల నివేదికలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఈ కేసులో మరిన్ని అంశాలు బయటపడే అవకాశం ఉందని, అవసరమైతే మరిన్ని సెక్షన్లు కూడా యాడ్ చేసే అవకాశం ఉందని పోలీసు అధికారులు అంటున్నారు.

శాఖపరంగా చర్యలు

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు కూడా సీరియస్‌గా ఉన్నారు. విచారణ పూర్తయిన తర్వాత శాఖపరంగా సస్పెన్షన్ తో పాటు డిస్మిస్ వరకు చర్యలు ఉండే అవకాశం ఉంది.

ఖాకీ పేరును నిలబెట్టాల్సిన ట్రైనీ ఐపీఎస్ అధికారే వివాదాల్లో చిక్కుకోవడంతో పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగింది. విచారణలో వెలుగులోకి వస్తున్న అంశాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.